
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
బుధవారం 28 మే 2025



'గమ్యం' చూపుమా

- కొన్ని రోజులుగా అందని ఆర్టీసీ గమ్యం యాప్ సేవలు
- కొన్ని డిపోల బస్సుల వివరాలకే పరిమితం
- డివైజ్ ఉన్నా కొన్ని బస్సుల్లో పనిచేయని వైనం



7



ఉమ్మడి జిల్లాకు మరో నాలుగు

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

ఒక్కో స్కూల్‌కు రూ.200కోట్లు కేటాయిస్తూ జీవో

సూర్యాపేట మినహా అన్ని నియోజకవర్గాలకు కేటాయింపు



నల్లగొండ, మే 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్‌ను ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మరో నాలుగు నియోజకవర్గాలకు మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా జీవో 96 విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 స్కూళ్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయగా, అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నాలుగు దక్కాయి. జీవోలో పేర్కొన్న ప్రకారం యాదాద్రి జిల్లాలోని ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలకు, నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ, దేవరకొండ (ఎస్టీ) నియోజకవర్గాల్లో ఈ నాలుగు స్కూళ్లకు బిల్డింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. అందుకోసం ఒక్కో స్కూల్‌కు రూ.200కోట్ల నిధులు వెచ్చిస్తారు. రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ ప్రతిపాదనల మేరకు ఈ నిధులతో పరిపాలనా అనుమతులు మంజూరుచేస్తున్నట్లు, నిర్మాణాల నిమిత్తం టీజీఈడబ్ల్యూఐడీసీ తదుపరి చర్యలు తీసుకోవాలని జీవోలో...

- మిగతా 7వ పేజీలో...

ఉమ్మడి జిల్లాకు మూడో మంత్రి పదవి కేటాయింపుపై ఉత్కంఠ కొనసాగుతోంది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఢిల్లీ పర్యటన సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రిపదవిపై అధిష్ఠానం స్పష్టత ఇచ్చిందనే సంకేతాలు వెలువడుతుండగా, మరోవైపు పీసీసీ కార్యవర్గం లోనూ ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక నేతల పేర్లను పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



అదే ఉత్కంఠ

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమంటున్న క్యాడర్
- అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందనే సంకేతాలు
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్ష పదవులకూ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేల పేర్ల పరిశీలన
- కీలకమైన నియామకాలు పూర్తయితే నామినేటెడ్ పదవుల పందేరం

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు కీలక భూమిక పోషించిన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అటు ప్రభుత్వంలో, ఇటు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడాన్ని తప్పుబట్టాల్సిందేమీలేదని, పార్టీకి వెన్నుముకలా నిలిచిన జిల్లా నేతలకు పదవులు ఇవ్వాల్సిందేననే డిమాండ్ క్యాడర్‌లో బలపడుతోంది. జిల్లాలు, సామాజిక సమీకరణాలు,వర్గాల పేరుతో పదవులకు దూరంపెట్టడం సమంజసం కాదని, సమర్థత, క్లిష్ట సమయాల్లో పార్టీకి అండగా ఉన్న నేతలకు పదవులిస్తేనే పార్టీకి ఊతమిచ్చినట్లు అవుతుందనే చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులతో పాటు, కార్యవర్గాన్ని తొలుత ప్రకటిస్తారని, ఆ జాబితా వెలువడితే క్యాబినెట్‌లో ఎవరికి అవకాశం దక్కుతుందనే అంశంపై స్పష్టత వస్తుందని పార్టీవర్గాలు భావిస్తున్నాయి.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖరారయిందనే సంకేతాలు

పీసీసీ కార్యవర్గం ఏర్పాటుతో పాటు, క్యాబినెట్ విస్తరణపై తాజాగా ఢిల్లీలో ఏఐసీసీ అధిష్ఠానం సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో నిర్వహించిన చర్చల సందర్భంగా పీసీసీ కార్యవర్గంతో పాటు, క్యాబినెట్ విస్తరణలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఒక దశలో ఆయన పేరును పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి పరిశీలిస్తున్నారనే లీకులు వచ్చినప్పటికీ క్యాబినెట్ పదవికే మొగ్గుచూపినట్లు సమాచారం. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి క్యాబినెట్ విస్తరణలో అవకాశం కల్పిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిందని, ఈ నేపథ్యంలోనే ఆయనకు మంత్రి పదవిని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే అందుబాటులో లేకపోవడంతో ఆయనతో ఈ నెలాఖరులో లేదా జూన్ మొదటివారంలో సమావేశమయ్యాక చివరగా పార్టీ లోక్‌సభాపక్షనేత రాహుల్‌గాంధీ ఆమోదం మేరకు మంత్రివర్గ విస్తరణపై తుది నిర్ణయం ఉంటుందని, విస్తరణ ఎప్పుడు జరిగినా రాజగోపాల్‌రెడ్డికి మంత్రిపదవి రావడం...

- మిగతా 7వ పేజీలో...

పార్టీ పదవుల అనంతరమే నామినేటెడ్ పదవులు

మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గ ఏర్పాటు, డీసీసీల నియామకాలు పూర్తయితేనే నామినేటెడ్ పదవుల నియామకం చేపట్టేందుకు లైన్‌క్లియర్ అవుతుందని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు, కమిషన్లలో సభ్యులుగా కొందరికే అవకాశం దక్కగా, ఉమ్మడి జిల్లా నుంచి ఇంకా పలువురు కీలక నాయకులు ఈ పదవుల కోసం హామీలు పొంది ఎదురుచూస్తున్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు, కీలకమైన యాదగిరిగుట్ట ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులుగా అవకాశం పొందేందుకూ పెద్ద సంఖ్యలో నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. వీటితో పాటు జిల్లాల స్థాయిలో ఉండే మహిళా ఆర్గనైజర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులు, మిర్యాలగూడ వంటి కీలకమైన మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కించుకునేందుకు పోటీపడుతున్న నేతలు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తున్నారు.



అప్రమత్తతే.. ఆయుధం

కరోనా వైరస్‌పై ప్రభుత్వం అలర్ట్‌గా ఉంది. పొరుగున ఉన్న రాష్ట్రాల్లో కొత్తగా పాజిటివ్ కేసులు నమోదవుతుండడంతో ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా వైద్యశాఖ అప్రమత్తమైంది. దేశంలో అక్కడక్కడ పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. అయితే ఇప్పటివరకు నిర్వహించిన జన్యుపరిణామక్రమ విశ్లేషణ ప్రకారం ఈ వైరస్ ఒమిక్రాన్ ఉప వేరియంట్‌గానే తేలినట్లు ఐసీఎంఆర్ ప్రకటించింది. ప్రజలు సాధారణంగా తీసుకునే నియంత్రణ చర్యలు తప్పితే కొత్తగా తీసుకోవాల్సిన అవసరం లేదని వెల్లడించింది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉందని భావిస్తే వైద్యుల సూచన మేరకు బూస్టర్‌డోస్‌లు తీసుకోవాలని, మిగతావారికి అవసరం లేదని ప్రకటించింది.
- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

- కొవిడ్‌పై ప్రభుత్వం అలర్ట్
- ఈ వేరియంట్‌తో పెద్దగా ముప్పు ఉండబోదన్న ఐసీఎంఆర్
- సాధారణంగా తీసుకునే నియంత్రణ చర్యలు చాలు
- గతంలో తీసుకున్న వ్యాక్సినేషన్‌తోనూ పెరిగిన వ్యాధి నిరోధకత
- వదంతులు నమ్మవద్దని వైద్యశాఖ సూచన



నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): కరోనా కేసులు నమోదవుతున్నాయనే వార్తల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. అయితే ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదు. సాధారణ జ్వరాలు, దగ్గు, జలుబు తప్ప ఎవ్వరికీ కరోనా లక్షణాలు లేవని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది.

వదంతులు వ్యాప్తిచెందకుండా చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల అనంతరమే కరోనాపై మాట్లాడాలి తప్ప సొంతంగా అధికారులు ఎలాంటి ప్రకటనలు చేయవద్దని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని సూచించింది. సాధారణంగా వచ్చే జలుబు, జ్వరం,దగ్గుకు ప్రజలు భయాందోళనకు గురి కావద్దని,అవి కరోనాతో వచ్చాయని భావించి భయపడాల్సిన అవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు. కరోనాఅంటూ ఎవరైనా ప్రచారం నిర్వహిస్తే చర్యలుంటాయని హెచ్చరిస్తున్నారు. ఇదిలాఉండగా, ఉమ్మడి జిల్లాలో ఆక్సిజన్ నిల్వలు,పడకలు, అవసరమైన మందులు, మాస్కులు, ఆర్టీపీసీఆర్ పరీక్షల కిట్‌లు, ఇతర సామగ్రి, వైద్యసిబ్బంది ఎంత అవసరం అనే విషయాలపై నివేదిక అందించాలని ప్రభుత్వం సూచించింది.
కరోనాను ఎదుర్కొనేందుకు దేవరకొండ...

- మిగతా 8వ పేజీలో...

కరోనాను అరికట్టేందుకు అన్ని చర్యలు



కరోనా మహమ్మారిని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆసుపత్రులకు ముందస్తుగానే ఆక్సిజన్, ఐసీయూ, పీపీ కిట్లు, మాస్కులు, మందులు అందుబాటులోకి వచ్చాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మాస్కులు ధరించాలి. చేతులు కలపవద్దు. జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. జిల్లా కేంద్రంతో పాటు అన్ని ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.
- డాక్టర్ మాతృనాయక్, డీసీహెచ్

నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో మోకాలిచిప్ప మార్పిడి శస్త్రచికిత్స

మొదటిసారి విజయవంతంగా నిర్వహించిన వైద్యులు



జిల్లా ప్రధానాసుపత్రిలో మోకాలిచిప్ప మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న వజ్జ ఎర్రయ్యతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, ఆర్థోపెడిక్ డాక్టర్ల బృందం

నల్లగొండ, మే 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండలోని ప్రభుత్వ ప్రధానాస్పత్రికి చెందిన ఐదుగురు వైద్యుల బృందం మొదటిసారిగా మోకాలిచిప్ప మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. మంగళవారం నల్లగొండ మండలం చర్లపల్లికి చెందిన వజ్జ ఎర్రయ్యకు ఆస్పత్రిలో మోకాలిచిప్ప మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. నల్లగొండ మండలం చర్లపల్లికి చెందిన 65 ఏళ్ల వయసున్న వజ్జ ఎర్రయ్య విపరీతమైన మోకాలు నొప్పితో నడవలేని స్థితిలో నల్లగొండ ప్రభుత్వ ప్రధానాస్పత్రికి వైద్యం నిమిత్తం వచ్చాడు. ఆయన్ను పరీక్షించిన ఆర్థోపెడిక్ విభాగం వైద్యులు మోకాలి చిప్ప మార్పిడి చేయాలని, అందుకు శస్త్రచికిత్స చేయాలని, జిల్లా ఆస్పత్రిలోనే పూర్తి ఉచితంగా నిర్వహిస్తామని సూచించారు. అందుకు ఎర్రయ్య అంగీకరించడంతో ఈనెల 22న ఆస్పత్రిలో ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ నాగరాజు బృందం శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించి ఎర్రయ్యకు మోకాలిచిప్పను మార్పిడి చేశారు. డాక్టర్లు కృష్ణానాయక్, సైదులు, మల్లికార్జున్, రాహుల్ ఈ వైద్యబృందంలో భాగస్వాములయ్యారు. కార్పొరేట్ ఆసుపత్రుల తరహాలో అత్యుత్తమ నైపుణ్యాలతో, ఆధునిక ఇంప్లాంట్లతో ఈ చికిత్స జరిగిందని వైద్యులు వివరించారు. శస్త్రచికిత్స తర్వాత తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, మోకాలినొప్పి తగ్గిందని, ఆస్పత్రి వైద్యులకు అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి తెచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులకు ఎర్రయ్య కృతజ్ఞతలు తెలిపారు. వైద్యబృందాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి అభినందించారు.

ధాన్యం కొనుగోలులో కనగల్ ప్రథమం

కనగల్, మే 27: (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది యాసంగి సీజన్‌ధాన్యం కొనుగోలులో ఐకేపీ కేంద్రాల జోరు కొనసాగింది. జిల్లాలో కనగల్ మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటుచేసిన 25 ఐకేపీ కేంద్రాల ద్వారా 55,506 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 6,842 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్టు ఏపీఎం సంకు హరి తెలిపారు. అందుకు సంబంధించి రూ.128కోట్లకు రూ.122 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ధాన్యం కొనుగోలులో శ్రమించిన మహిళా సంఘాలకు, సహకరించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

మిర్యాలగూడలో తిరంగా ర్యాలీ

ఉత్సాహంగా పాల్గొన్న యువత



మిర్యాలగూడలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న యువకులు

మిర్యాలగూడ టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కీర్తిస్తూ మంగళవారం మిర్యాలగూడలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణ, పరిసర ప్రాంత యువత ఉత్సాహంగా పాల్గొన్న ఈ ర్యాలీ ఫ్లైఓవర్ వద్ద ప్రారంభమై సాగర్‌రోడ్ మీదుగా రౌండ్ వరకు సాగింది. వ్యాపార, పారిశ్రామిక, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు. జైహింద్, జై భారత్ అంటూ జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాదినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో యువత స్వచ్ఛందంగా పాల్గొనడం హర్షనీయమన్నారు. భారతీయులందరూ కలిసికట్టుగా ఉండాలని, దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో చెరుపల్లి కరుణాకర్, బంటు సైదులు, చిలుకూరు శ్యాం, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎడ్ల రమేష్, బంటు సైదులు, రవీందర్‌గౌడ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే నోటీసులు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయించిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారని, ఏసీబీ నోటీసులు జారీ చేయించి బీఆర్ఎస్ నేతలపై బెదిరింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు వరుస నోటీసులు జారీ చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉన్నట్లు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఎవరెన్ని ఇబ్బందులుపెట్టినా కేసీఆర్ సారథ్యంలో పనిచేస్తామన్నారు. బీఆర్ఎస్‌ను చూస్తే కాంగ్రెస్ సర్కార్‌కు రోజు రోజుకూ భయపడే పరిస్థితి నెలకొందని, బెదిరింపులకు భయపడేది లేదని ఆయన పేర్కొన్నారు.

ద్విచక్రవాహనంపై మండలి చైర్మన్



చిట్యాలరూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ద్విచక్రవాహనం ఎక్కి గ్రామంలో కలియతిరిగారు. రాజ్యాంగబద్ధ పదవిలో నిత్యం అంగరక్షుల భద్రతలో ఉండే ఆయన మంగళవారం తన స్వగ్రామమైన చిట్యాల మండలం ఉరుమడ్లకు వచ్చారు. గ్రామ శివారులో ఉన్న తన వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించేందుకు సాధారణ రైతుగా తన అనుచరుడితో కలిసి బైక్‌పై వెళ్లారు. అక్కడ కలియ తిరుగుతూ క్షేత్రాన్ని పరిశీలించారు.

చెర్వుగట్టుపై ఘనంగా లక్ష పుష్పార్చన వేడుక



చెర్వుగట్టులో ఉత్సవ మూర్తులకు లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంపై మంగళవారం లక్ష పుష్పార్చన మహోత్సవం ఘనంగా జరిగింది. అమావాస్య సందర్భంగా నిర్వహించే ఈ వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమావాస్య తిథి సోమ, మంగళవారం రెండు రోజులు ఉండటంతో రెండు రోజుల పాటు క్షేత్రానికి భక్తుల తాకిడి కన్పించింది. కాగా, మంగళవారం గర్భాలయం నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ మహామండపానికి చేర్చారు. ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సహార్చకులు సతీశ్ శర్మ, సురేశ్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ పూజాదికాలు నిర్వహించి ఉత్సవ మూర్తులను అభిషేకించారు. స్వామి పాదాల చెంత పూజలు అందుకున్న పుష్పాల కోసం భక్తులు పోటీపడ్డారు. స్వామి వారి పుష్కరిణిలో స్నానమాచరించి పార్వతీ జడల రామలింగేశ్వరుడితో పాటు గుట్టపైన ఉన్న ఉపాలయాలు, గుట్ట కింద ఉన్న పార్వతీ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పాదరక్షలు, కోడె మొక్కులను తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో దేవస్థానం ఈవో సిరికొండ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, వర్షం కురవడంతో భక్తులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.

రోడ్డు పనులను వేగవంతం చేయాలి

పీఆర్ ఈఈ గిరిధర్



వల్లాలలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఈఈ గిరిధర్

శాలిగౌరారం, మే 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ విభాగంలోని పనులను వేగవంతంగా చేపట్టాలని పంచాయతీరాజ్‌శాఖ ఈఈ గిరిధర్ అన్నారు. మండలంలోని వల్లాల నుంచి జోలంవారిగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోడ్డు పనుల్లో నాణ్యత లోపించకుండా నిర్మించాలన్నారు. ఆయన వెంట డీఈఈ కొండయ్య, ఏఈ భరత్‌చంద్ర, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, వల్లాల మాజీ సర్పంచ్ షేక్ ఇంతియాజ్ అహ్మద్, నాయకులు కట్టంగూరు సురేందర్‌రెడ్డి, నరిగే ఆంజనేయులు, సంకటి లింగయ్య, తదితరులు ఉన్నారు.



పూర్తికావస్తున్న బ్రిడ్జి పనులు



తిరుమలగిరి సమీపంలోని అనంతారం వద్ద బిక్కేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి

(ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి)

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం అనంతారం సమీపంలోని బిక్కేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు దాదాపు పూర్తికావచ్చాయి. రంగారెడ్డి జిల్లా ఘట్కేసర్ మండలం గౌరెల్లి నుంచి భద్రాద్రికొత్తగూడెం జిల్లా కేంద్రం వరకు జాతీయ రహదారిని (65వ నెంబరు) నిర్మిస్తున్నారు. ఈ రహదారి యాదాద్రిభువనగిరి జిల్లాలోని వలిగొండ మీదుగా సూర్యాపేటలోని తిరుమలగిరి నుంచి తొర్రూరు మీదుగా కొత్తగూడెం వరకు విస్తరించి ఉంటుంది. మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు, సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి వాసులు హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. తిరుమలగిరి సమీపంలోని అనంతారం వద్ద బిక్కేరు వాగుపై ప్రతీ వానాకాలంలో వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కల్వర్టుపై రాకపోకలు నిలిచిపోయేవి. ఈ క్రమంలో హైవే నిర్మాణంలో భాగంగా సుమారు అరకిలోమీటరు మేర బ్రిడ్జి పనులు చేపట్టారు. పిల్లర్ల నిర్మాణం పూర్తవడంతో పైన స్లాబ్ పనులు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో రహదారిని బ్రిడ్జి అనుసంధానించే రోడ్డు పనులు కూడా చేపట్టారు. మరో నెల రోజుల్లో పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. ఈ బ్రిడ్జి పూర్తయితే తిరుమలగిరి, అడ్డగూడూరు, మోత్కూరు మండలాల్లోని సుమారు 50 గ్రామాలకు వర్షాకాలంలోనూ రాకపోకలు సులువు కానున్నాయి.

ఐస్ లేకుండానే చల్లదనం






ఫ్రిడ్జ్‌లో ఉంచిన చెరకుగడలు, ఆ గడలతో తయారు చేసిన చెరకురసాన్ని విక్రయిస్తున్న వ్యాపారి

- ఫ్రిడ్జ్‌లో చెరుకు గడలు
- వినియోగదారులకు చల్లటి చెరుకు రసం
- తప్పుతున్న ఐస్ ముప్పు
- ఆరోగ్యానికి బహుళ ప్రయోజనాలు

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

చెరుకు రసంతో శరీరానికి వెంటనే ఉపశమనం లభిస్తుంది. చల్లదనం కోసం పలువురు చెరుకు రసంలో ఐస్‌ను కలపాలని విక్రయదారులకు సూచిస్తుండటం పరిపాటి. అయితే ఐస్ తయారీలో ప్రమాణాలను విస్మరిస్తుండటంతో పానీయాలలో వాడుతున్న ఐస్ కాస్త ఆరోగ్యానికి చేటుగా మారుతోంది. దీంతో ఇటీవల ఐస్ లేకుండానే చెరుకు రసంతో పాటు ఇతర పండ్ల రసాలను కూడా ఇష్టపడుతున్నారు. అయితే వినియోగదారుల అభిరుచికి అనుకూలంగా ఐస్ కల్పకుండానే చల్లని చెరుకు రసాన్ని విక్రయదారులు విక్రయదారులు అందిస్తున్నారు. ఇందుకు విక్రయాదారులు శుభ్రం చేసిన చెరుకు గడ్డలను ఫ్రిడ్జ్‌లో భద్రపరుస్తున్నారు. ఇటీవలి వరకు ఆహార పదార్థాలు, ఐస్‌క్రీమ్‌లు, కేక్ తదితర పదార్థాలను మాత్రమే ఫ్రిడ్జ్‌లో భద్రపరిచేవారు. కానీ ఐస్ ప్రమాణాలపై సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో చెరకు రసం విక్రయదారులు చెరుకు గడలను ఫ్రిడ్జ్‌లలో నిలువ చేస్తున్నారు. ఒక్కో చెరుకు గడను కనీసం మూడూ రోజుల పాటు ఫ్రిడ్జ్‌లో భద్రపర్చవచ్చు. దీంతో చెరుకు రసం ఐస్ కలపకుండానే చల్లగా ఉంటుండటంతో వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వ్యాపారులు అంటున్నారు. ఆ చల్లటి చెరుకు రసానికి నిమ్మ రసం, అల్లం, పుదీనా ఆకులు జోడిస్తే మరింత రుచిగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెరుకు రసం ప్రియులు అంటున్నారు. గ్లాసు చెరకు రసం రూ.25 నుంచి 30 రూపాయల వరకు, లీటర్ చెరకు రసం రూ.100 నుంచి 125 రూపాయల వరకు విక్రయిస్తున్నారు.



చెరుకు రసంతో ఉపయోగాలు..

చెరుకు రసం ఆరోగ్యానికి బహుళ ప్రయోజకారిగా ఉంటుంది. ఏ కాలంలోనైనా చెరకు రసం తాగొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. చెరకు రసంలో సహజంగా ఉండే గ్లూకోజ్‌తో దాహాన్ని నివారించి శక్తిని పెంచుతోంది. పోషకాలతో జీర్ణక్రియ మెరుగుపడి అజీర్తి, గ్యాస్ తదితర ఇబ్బందుల నుంచి ఉపశమనం కలుగుతుంది. మూత్రవిసర్జన మెరుగుపడుతుంది. చెరుకు రసంలో ఉండే గ్లైకొలిక్ ఆమ్లంతో చర్మం కాంతివంతంగా మారడంతో పాటు ముడతలు, మొటిమలు తగ్గుతాయి. కాల్షియం, మెగ్నీషియం, పాస్పరస్ లభించి ఎముకల బలోపేతం అవుతాయి. చెరుకు రసంలోని పోటాషియం రక్తపోటును నియంత్రించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అలాగే కామెర్లు వచ్చినవారు చెరుకు రసం తాగితే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా మధుమేహం ఉన్న వారు మాత్రం చెరుకు రసాన్ని వైద్యుల సలహాతో స్వీకరిస్తే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

ముగ్గురిని బలిగొన్న కుటుంబ కలహాలు

● యాదాద్రి జిల్లాలో ఒకరు, నల్లగొండ జిల్లాలో ఇద్దరి ఆత్మహత్య



యాదయ్య(ఫైల్)

కొండమల్లేపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో గీత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ అజ్మీర్ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరెడుగొమ్ము మండలం పేర్వాల గ్రామానికి చెందిన ఎరుకల యాదయ్య(48) గీత కార్మికుడు కుల వృత్తితో పాటు భార్య కృష్ణమ్మతో కలిసి వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొద్దిరోజులుగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపంతో ఉన్న యాదయ్య సోమవారం కొండమల్లేపల్లిలో క్రిమిసంహారక మందు కొనుగోలు చేశారు. రాత్రి దేవరకొండ రోడ్డులోని సత్తమ్మ వెంచర్‌లో ఆ మందును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు యాదయ్య మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య కృష్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జీవితం విరక్తి చెంది ఎలక్ట్రీషియన్...

రాజాపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రానికి చెందిన ఎలక్ట్రీషియన్ జీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాజాపేట మండల కేంద్రానికి చెందిన ఎక్కలదేవి వెంకటేశం(45) ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. విభేదించి ఎనిమిదేళ్ల కిందట భార్య అతడిని విడిచివెళ్లడంతో ఒంటరిగా ఉంటున్నాడు. ఒంటరితనంతో పాటు పనులు నిర్వహించడం చేతకాక జీవితంపై విరక్తి చెందిన మనస్తాపం చెందిన ఆయన ఇంట్లో ఉరివేసుకున్నాడు. రెండు, మూడు రోజులుగా ఇంటి తలుపులు తెరిచి ఉండకపోవడంతో పాటు దుర్వాసన వస్తుండటంతో మంగళవారం సాయంత్రం చుట్టుపక్కల వాళ్లు తలుపులను పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



వెంకటేశం(ఫైల్)

ఏపనీ చేయని భర్త తీరుతో...



రాధ(ఫైల్)

గుర్రంపోడు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఏపని చేయకుండా భర్త అప్పులు చేయటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం జిన్నాయిచింతలో జరిగింది. ఎస్ఐ మధు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జిన్నాయిచింత గ్రామానికి చెందిన కట్టెబోయిన రాధ(30) భర్త వెంకటేష్ కొంతకాలంగా మద్యానికి బానిసై ఏపనీ చేయకుండా అప్పులు చేస్తున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన రాధ ఆదివారం రాత్రి ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందిందని ఎస్ఐ మధు తెలిపారు. ఆమె తల్లి గొర్ల నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కాచారంలో రైతు ఆత్మహత్యాయత్నం

యాదగిరిగుట్ట రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): నిషేధిత బీటీ-3 విత్తనాలు ఎక్కడ కొనుగోలు చేశావని ఎస్ఓటీ(స్పెషల్ ఆపరేషన్ టీమ్) పోలీసులు ప్రశ్నించటంతో ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. కాచారం గ్రామానికి చెందిన దడిగె రాములు(40) తనకున్న మూడు ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. సోమవారం తన భూమిలో పత్తి విత్తనాలు విత్తుతున్నాడు. అవి ప్రభుత్వం నిషేధించిన బీటీ-3 రకం విత్తనాలు కావడంతో సమాచారం మేరకు ఎస్వోటీ పోలీసులు పొలం వద్దకు వెళ్లారు. విత్తనాలు ఎవరివద్ద కొనుగోలు చేశావని ప్రశ్నించగా, బావివద్ద ఉన్న గదిలో నీళ్ల తాగివస్తానని వెళ్లి అక్కడే ఉన్న పురుగుల మందు తాగాడు. ఎస్ఓటీ పోలీసులు గమనించి రాములుకు భువనగిరి ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ తరలించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని సీఐ భాస్కర్ తెలిపారు.

కారు డీసీఎం ఢీకొని ఒకరు మృతి

శాలిగౌరారం, మే 27 (ఆంధ్రజ్యోతి) : డీసీఎం కారును ఢీకొన్న ఘటనలో కారులోని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం మామిడాల గ్రామానికి చెందిన కుర్ర శంకర్(30) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శంకర్ అత్తగారు గ్రామమైన శాలిగౌరారం మండలం వల్లాల నుంచి కారులో స్వగ్రామం మామిడాలకు బయలుదేరాడు. వంగమర్తి గ్రామ సమీపంలోకి రాగానే అతివేగంతో వచ్చిన డీసీఎం వాహనం వెనుక నుంచి కారును బలంగా ఢీకొట్టింది. కారు ముందున్న కల్వర్టు గోడను ఢీకొని కారులో శంకర్ చిక్కుకుపోయాడు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ సైదులు పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని కారులో చిక్కుకున్న శంకర్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో అతి కష్టంగా బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శంకర్‌కు భార్య మాధవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పాలకవీడు, మే 27 (ఆంధ్రజ్యోతి) :సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం బెట్టెగూడెంలో రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన షేక్ సైదా అదే గ్రామంలో విద్యుత్‌శాఖలో లైన్‌మన్ కింద ఆర్టీజన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా జాన్‌పహాడ్ గ్రామంలో వినియోగదారులు చెల్లించిన విద్యుత్ బిల్లులను తీసుకుని మండలకేంద్రంలోని కార్యాలయంలో జమ చేసి తిరిగి జాన్‌పహాడ్ గ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో బెట్టెగూడెంలో గేదె అడ్డురావడంతో బైక్‌అదుపుతప్పి కిందపడి తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియాసుపత్రికి తరలించారు. అనంతం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొట్టపుపైప్ పడి వలస కూలీ ..

భూదాన్‌పోచంపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లిలోని రైస్‌మిల్లులో ప్రమాదవశాత్తు గొట్టపు పైప్‌మీద పడి బిహార్ వలస కూలీ మృతి చెందాడు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన కథనం మేరకు పిలాయిపల్లి గ్రామ శివారులోని ఇంద్రకీలాద్రి రైస్ ఇండస్ట్రీస్‌లో బిహార్ రాష్ట్రానికి చెందిన వలస కూలీ కుమోద్‌కుమార్(19) పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు రైస్‌మిల్లులో తవుడు వచ్చే గొట్టపు పైప్‌ను గట్టిగా పారలాంటి పైప్‌తో మోదాడు. గొట్టపు పైపుతో పాటు దానిపై ఉన్న ఐరన్ రేకులు ఒక్కసారిగా కుప్పకూలి అతడిపై పడ్డాయి. దీంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని వివేరా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కుమోద్‌కుమార్ మృతదేహానికి భువనగిరి ఏరియాఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. కుమోద్‌కుమార్‌కు వరుసకు సోదరుడైన రాజుకుమార్‌యాదవ్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉద్రిక్తతకు దారితీసిన ఆవుల అక్రమ రవాణా

భువనగిరి టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఆవుల అక్రమ రవాణా ప్రయత్నాలు యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో సోమవారం అర్ధరాత్రి ఉద్రిక్తతకు దారితీసింది. పట్టణ రహదారులపై సంచరిస్తున్న ఆవులను జూనియర్ కళాశాల ఆవరణలో తాళ్లతో కట్టివేసి ట్రక్కులో ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలుసుకున్న హిందూ సంఘాల కార్యకర్తలు అడ్డుకున్నారు. తాళ్లను విప్పివేసి ఆవులను తరిమివేశారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదాలు జరిగి స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఈ మేరకు ఆవుల అక్రమ రవాణాపై దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, పట్టణంలో సంచరిస్తున్న పశు సంపదను బంధించి గోశాలకు తరలించాలని కోరుతూ బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ బింగి భరత్‌కుమార్, పట్టణ కన్వీనర్ నెమిల నవీన్‌కుమార్, వీహెచ్‌పీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ సాల్వేరు వేణు ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్, డీసీపీ, ఏసీపీ, మునిసిపల్ కమిషనర్లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. అయితే పట్టణ పోలీసులు ఇరువర్గాలతో వేర్వేరుగా చర్చించి శాంతిభద్రతలకు సహకరించాలని సూచించారు. అనంతరం శాంతి సంఘ సమావేశం నిర్వహించి అక్రమ రవాణాకు పాల్పడవద్దని సూచించారు.

నకిలీవిత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

మిర్యాలగూడ అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాల విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్ హెచ్చరించారు. మిర్యాలగూడ పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని విత్తన విక్రయ కేంద్రాల్లో మంగళవారం పోలీస్, వ్యవసాయాధికారులు సమష్టిగా తనిఖీలు నిర్వహించారు. తొలిరోజు 23 దుకాణాల్లో పోలీస్, వ్యవసాయాధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రికార్డులు, బిల్లు బుక్‌లను పరిశీలించారు. దుకాణాల్లోని నిల్వలను తనిఖీ చేశారు. అదేవిధంగా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న విత్తన కంపెనీల అనుమతిపత్రాలను సైతం పరిశీలించారు. అనంతరం ఏడీఏ సైదానాయక్, సీఐలు మోతీరాం, రామనర్సయ్యలు మాట్లాడుతూ వానాకాలం పంటలసాగు సీజన్ సమీపించిన క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు ముమ్మరంగా కొనసాగిస్తామన్నారు. వారివెంట ఎస్ఐలు సైదిరెడ్డి, లక్ష్మయ్య, ఏఈవోలు ఉన్నారు.



మిర్యాలగూడలోని సీడ్స్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్, సీఐ రామనర్సయ్య

చింతపల్లి : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ రాజు, ఏవో శ్రావణకుమారి తెలిపారు. చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్, కుర్మేడ్‌లోని పలు ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు విక్రయించిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీకి విక్రయించాలని డీలర్లకు సూచించారు. తనిఖీల్లో ఎస్ఐ రాంమూర్తి, ఏఈవోలు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.



పీటీనగర్‌లో తనిఖీలు చేస్తున్న సీఐ రాజు, ఏవో శ్రవణకుమారి

చందంపేట: విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు రశీదులను అడిగి తీసుకోవాలని నల్లగొండ జిల్లా చందంపేట మండల వ్యవసాయ అధికారి లక్‌పతి అన్నారు. పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలను, పురుగుమందులను విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్ఐ లోకేష్, అధికారులు ఉన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : వ్యవసాయ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద వివిధ ఎరువులు, పురుగుల మందుల దుకాణాలు, సీడ్ ప్రాసెసింగ్ సంస్థలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, వ్యవసాయఅధికారి రావుల పాండు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. రైతులు విత్తనాల రశీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచాలన్నారు. దుకాణాదారులు విధిగా స్టాక్‌బోర్డును ఏర్పాటుచేయాలన్నారు.



మర్రిగూడ మండలం రాజపేటతండాలో మొక్కలు లేక కనిపిస్తున్న మట్టితో నిండిన సంచులు

వన మహోత్సవ లక్ష్యం నెరవేరేనా?

● ఖాళీగా దర్శనమిస్తున్న నర్సరీలు

మర్రిగూడ, మే 27 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవం విజయవంతంపై నీలినీడలు కమ్ముకున్నాయి. నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం లక్ష్యం చేరుకోలేని పరిస్థితి నెలకొంది. మొక్కల పెంపకం లక్ష్యం చేరుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నా అలసత్వం వహిస్తున్నారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో 18 గ్రామపంచాయతీల పరిధిలో రెండు లక్షల మొక్కలను పెంచాలనే లక్ష్యంతో నర్సరీలను ప్రారంభించారు. కానీ ఎక్కడా ఆశించిన సంఖ్యలో మొక్కలు కనిపించడం లేదు.ఈ విషయమై ఉపాధిహామీ పథకం అధికారి వివేక్‌ను వివరణ కోరగా విత్తనాలు మొలకెత్తలేదని, కొత్తగా నాణ్యమైన విత్తనాలను విత్తామని వనమహోత్సవం నాటికి ఎదుగుతాయన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

శాలిగౌరారం, మే 27 (ఆంధ్రజ్యోతి):ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం రామాంజపురం గ్రామంలో కల్లెపల్లి నర్సయ్యకు చెందిన గేదె గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత చేస్తోంది. విద్యుత్‌తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై పక్కనే ఉన్న కాల్వలోకి పడి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.60వేల వరకు ఉంటుందని బాధితుడు నరసయ్య తెలిపారు. విద్యుత్ అధికారులు మృతి చెందిన గేదెకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.

మద్యం మత్తులో ఇబ్బందిపెట్టిన వ్యక్తికి జైలు

సూర్యాపేట క్రైం, మే 27 (ఆంధ్రజ్యోతి): మద్యం అతిగా సేవించి ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తో పాటు స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు సూర్యాపేట పట్టణ ఎస్ఐ వాసా ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేటకు చెందిన చేను సుభాష్ అతిగా మద్యం సేవించి ఈ నెల 26న అర్ధరాత్రి సూర్యాపేటలోని హైటెక్ బస్టాండ్‌కు వెళ్లాడు. అక్కడ బస్సు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. అంతేకాకుండా అక్కడ ఉన్న ప్రజలతో గొడవ పడి ఇష్టానుసారంగా దుర్భాషలాడటంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే బస్టాండ్ వద్దకు చేరుకుని ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్న సుభాష్‌ను అదుపులోకి తీసుకుని అతడిపై కేసు నమోదు చేసి మంగళవారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. కోర్టులో సుభాష్‌కు ద్వితీయశ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా మద్యం తాగి ఇతరులతో వాగ్వాదం పెట్టుకున్నా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా జైలు శిక్ష తప్పదని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు.

చెట్లును తగలబెట్టిన వ్యక్తిపై కేసు

మోత్కూరు, మే 27 (ఆంధ్రజ్యోతి):యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలకేంద్రంలో గుంటి అయిలయ్య వ్యవసాయభూమిలో చింతచెట్లను ఇటీవల పక్క రైతు బీసు యాకయ్య తగులబెట్టాడు. అయిలయ్య ఫిర్యాదు మేరకు విచారణ జరిపి యాకయ్యపై కేసు నమోదు చేసినట్లు మోత్కూరు ఎస్ఐ నాగరాజు మంగళవారం తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

పాలకవీడు, మే 27 (ఆంధ్రజ్యోతి) : డబ్బులు పెట్టి పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు సూర్యాపేట జిల్లా పాలకవీడు ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని రావిపహాడ్ గ్రామానికి చెందిన మాతంగి ప్రేమ్‌కుమార్ ఇంటిలో ఆరుగురు పేకాటఆడుతున్నట్లు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. పేకాడుతున్న మాతంగి ప్రేమ్‌కుమార్, పేరబోయిన వెంకన్న, భూక్యా నాగ, పల్లా రవి, అజ్మీర శంకర్, వీరయ్యలను పట్టుకుని వారి నుంచి రూ.21,200, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గోడకేసి కొట్టి.. ఆపై గొంతు నులిమి

భర్తను హత్య చేసిన భార్య



కిషన్‌నాయక్(ఫైల్)

వనస్థలిపురం, మే 27 (ఆంధ్రజ్యోతి) : అనుమానిస్తూ తాను పనిచేస్తున్న ఆఫీసుకు వచ్చి గొడవ పెట్టుకున్నాడని, ఇష్టం వచ్చినట్లు మాట్లాడి పరువు తీశాడని కక్షతో భర్తను హతమార్చింది. మద్యం మత్తులో ఉన్న అతడిని గోడకేసి నెట్టడంతో పాటు భర్త గొంతు నొక్కిపెట్టి దారుణంగా హత్య చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన వెలుగుచూసింది. యాదాద్రిభువనగిరి జిల్లా నారాయణపురం మండలం బావత్‌తండాకు చెందిన సభావత్ కిషన్‌నాయక్(40)ఆటో, లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. మర్రిబాయితండాకు చెందిన కళతో 2005లో వివాహం కాగా వీరికి బిందు(19), నితిన్(17), నిఖిల్(15) ముగ్గురు సంతానం. వీరు అమ్మమ్మ వద్ద ఉంటు జీవనం సాగిస్తున్నారు. కిషన్ నాయక్ మొదటి భార్య కళ 2015లో మృతి చెందింది.

అదే సంవత్సరం శిరీషతో...

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన శిరీష(28) 2014లో వివాహం కాగా 2015లో విడాకులు తీసుకుంది. ఈ క్రమంలో కిషన్‌నాయక్‌కు శిరీషతో పరిచయమైంది. అనంతరం వీరు 2015లో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు మహేష్ కుమార్(8), సాయిసందీప్(5) సంతానం. వీరు కిషన్‌నాయక్ గ్రామంలో ఉంటూ వ్యవసాయం పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శిరీషకు మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న కిషన్‌నాయక్ భార్య శిరీషను మందలించాడు. దీంతో 2019 నుంచి ఇరువురి మధ్య మనస్పర్ధలు తలెత్తాయి. వీరు రెండు నెలల నుంచి వనస్థపురంలోని హిల్‌కాలనీలో అద్దెకు ఇల్లు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. శిరీష చింతలకుంటలోని తనిష్క్ షోరూంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తోంది. సోమవారం సాయంత్రం మద్యం మత్తులో కిషన్‌నాయక్ తనిష్క్ షోరూంకు వెళ్లగా అక్కడ నుంచి శిరీష, కిషన్‌నాయక్‌లు కలిసి ఇంటికి వచ్చారు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి శిరీష కిషన్ నాయక్‌ను గట్టిగా గోడకు కొట్టింది. స్పృహతప్పి కిందపడిపోయిన అతడి గొంతును నులిమి హత్య చేసింది. అనంతరం అంబులెన్స్‌కు ఫోన్ చేసి వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించింది. కిషన్‌నాయక్‌కు పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కిషన్ నాయక్ మొదటి భార్య కుమార్తె బిందు మంగళవారం తన తండ్రిని శిరీష హత్య చేసిందనీ ఫిర్యాదు చేసింది. ఆ మేరకు నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగ కిషన్ నాయక్‌ను శిరీష ఒక్కరే హత్య చేసిందా..ఆమెతో పాటు ఇంకా ఎవరైనా ఉన్నారనీ అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహంపై ఎలాంటి గాయాలు, రక్తపు మరకలు లేవని వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశీరెడ్డి తెలిపారు.

తీర్థయాత్రలకు వెళ్లొద్దాం..



» హైదరాబాద్ నుంచి రెండు ప్రత్యేక రైళ్లు

» జూన్ 14 నుంచి జూలై 13 వరకు టూర్



తీర్థ యాత్రలకు వెళ్లే వారికోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చింది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జూన్ 14వ తేదీ నుంచి జూలై 13వ తేదీవరకు రెండు ప్యాకేజీలుగా ప్రత్యేక రైళ్లను హైదరాబాద్ నుంచి నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ టౌన్)

ప్యాకేజీ -1 : గంగా రామాయణ పుణ్య క్షేత్ర యాత్ర..

ఎస్‌సీజెడ్‌బీజీ 44 నెంబర్ గల రైలులో (కాశీ)వారణాసి / అయోధ్య / నైమిశారణ్య / ప్రయాగరాజ్ / శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర జూన్ 14 వ తేదీన ప్రారంభమై 22 వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ. 16,200, 3వ ఏసీ ధర రూ. 26,500, 2వ ఏసీ ధర రూ. 35,000 ఉంటుంది. ఈ రైలు సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్‌ల మీదుగా వెళ్తుంది.

ప్యాకేజీ -2 : ఐదు జ్యోతిర్లింగ యాత్ర ..

ఎస్‌సీజెడ్‌బీజీ -43 నంబర్ గల రైలులో ఉజ్జయిని (మహాకాళేశ్వర్ - ఓంకారేశ్వర్- త్రయంబకేశ్వర్ - భీమశంకర్ - ఘృష్ణేశ్వర్). మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగ్పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చు. ఈ యాత్ర జూలై 5వ తేదీన ప్రారంభమై 13 వ తేదీ వరకు ఉటుంది. ఈ యాత్రకు ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ.14700, 3వ ఏసీ ధర 22,900, 2వ ఏసీ ధర 29,900 ఉంటుంది. ఈ రైలు సికింద్రాబాద్ కామారెడ్డి నిజామాబాద్ ధర్మాబాద్ నాందేడ్ ముథ్కడ్ నుంచి పూర్ణ మీదుగా వెళ్తుంది.

సౌకర్యాలు ఇలా...

రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం), వాటర్ బాటిల్, టూర్ ఎస్కాట్ సేవలతో సందర్శనా స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్ అలాగే రైల్వేస్టేషన్ నుంచి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగా ఉచితం. ప్రతి రైలులో 718 మంది ప్రయాణికులు ఉంటారు. ప్రతి 70 మందికి ఇద్దరు కో ఆర్డినేటర్లు అందుబాటులో ఉండి అన్ని సాకర్యాలు సమకూరుస్తారు. కోచ్‌కి ఒక సెక్యూరిటీ గార్డు, అలాగే రైలు లో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుంది. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు సెల్: 970360701, 9281030712, 9281495845, 9281030749, 9281030750 నెంబర్లలో సంప్రదించాలి.

'గమ్యం' చూపుమా



» కొన్ని రోజులుగా అందని ఆర్టీసీ గమ్యం యాప్ సేవలు

» కొన్ని డిపోల బస్సుల వివరాలకే పరిమితం

» డివైజ్ ఉన్నా కొన్ని బస్సుల్లో పనిచేయని వైనం

అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని టీజీఎస్ ఆర్టీసీ తీసుకువచ్చిన 'గమ్యం' ఆండ్రాయిడ్ యాప్ కొన్ని రోజులుగా సరిగా పనిచేయడం లేదు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సంస్థ నిర్వహణ కార్యకలాపాలు, వేగంగా సేవలందించేందుకు యాప్ రూపొందించారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సుల రాకపోకలు, వేళలను సులభంగా, నిక్కచ్చిగా తెలుసుకునేందుకు బహుళ ప్రయోజనార్థం రూపొందించిన 'గమ్యం' యాప్ సేవలు సమర్థంగా అందడం లేదు. యాప్‌తో తమ ప్రయాణ ప్రణాళిక తయారు చేసుకునే కొందరు ప్రయాణికులకు యాప్ పనిచేయకపోవడం అసౌకర్యంగా మారింది. (ఆంధ్రజ్యోతి- నార్కట్‌పల్లి)

గమ్యం యాప్ ద్వారా బస్సుల రాకపోకలను ఖచ్చితంగా తెలుసుకోవచ్చు. బస్సుల్లో అమర్చిన టెక్నికల్ డివైజ్‌తో ఆ బస్సు ఎక్కడుందో ఏ సమయానికి ఎక్కడికి చేరుతుందో కాస్త అటూ...ఇటూ...గా యాప్ ద్వారా ట్రాక్ చేయవచ్చు. మనం వెళ్లాలనుకున్న రూట్‌లో ఆర్టీసీ నడిపే అన్ని కేటగిరీల బస్సులను నెంబర్లు, రూట్ల వారీగా ఏ టైంకు ఏ బస్సు ఎన్ని గంటలకు వెళ్తుందో...లేదా వస్తుందో...సులభంగా తెలుసుకునే వీలుంది. పరిచయం లేని ప్రాంతాల్లోకి వచ్చే కొత్త ప్రయాణికులకు ఇది ఎంతగానో దోహదపడనుంది. వారికి దగ్గరలో ఉండే బస్‌స్టాప్‌లు అవి చేరుకునే సమయాన్ని ఈయాప్ తెలుపుతుంది. ప్రయాణీకుల సేవలతో పాటు ఆయా రూట్లలో నడిచిన బస్సు మొత్తం ఎన్ని ట్రిప్పులు ఎన్ని కిలో మీటర్లు నడిచిందో కూడా చెప్పే విధంగా యాప్‌ను డిజైన్ చేశారు.

'గమ్యం' చూపని యాప్...

గమ్యం యాప్‌తో కొందరు ప్రయాణికులు తమ ప్రయాణ ప్రణాళికలను సిద్ధం చేసుకునేవారు. కానీ కొన్ని రోజులుగా ఈ యాప్ సరైన విధంగా సేవలందించడం లేదు. యాప్ తెరిచి అడిగిన మనకు కావాల్సిన రూట్లలో బస్సుల వివరాలను నమోదు చేసినా కూడా యాప్‌లో సమాచారం రావడం లేదు. కొన్ని డిపోలకు చెందిన బస్సుల వివరాలు వస్తుండగా కొన్ని డిపోలకు చెందిన బస్సుల వివరాలను చూపించడం లేదు. ఉదాహరణకు సూర్యాపేట డిపోకు చెందిన కొన్ని బస్సుల వివరాలు గమ్యంలో చూపడం లేదు.

'గమ్యం' చూపేలా చర్యలు

ప్రయాణీకుల సౌలభ్యం కోసం తెచ్చిన గమ్యం యాప్ సేవలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటాం. నల్లగొండ రీజియన్ పరిధిలోని 7 డిపోల్లో గల 640 బస్సుల్లో వాస్తవానికి కొన్ని బస్సుల్లో డివైజ్‌ను అమర్చలేదు. డివైజ్ అమర్చని బస్సులకు సంబంధించిన సమాచారం గమ్యం యాప్‌లో బహుశా రాకపోవచ్చు. కాని డివైజ్ ఉండి కూడా గమ్యం యాప్ లో సమాచారం రావడం లేదంటే సమస్య ఏమి టో తమ టెక్నికల్ సిబ్బందిని విచారించి పరిష్కరించి సేవలందించేలా చర్యలు తీసుకుంటాం.

- జాన్‌రెడ్డి, ఆర్టీసీ నల్లగొండ ఆర్ఎం.

జాజిరెడ్డిగూడెంలో 10.2సెంటీమీటర్ల వర్షం

నల్లగొండ, శాలిగౌరారం, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం సాయంత్రం భారీ ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో పలు మండలాల్లో వర్షం కురిసింది. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం, వల్లాల, అడ్లూర్, తక్కెళ్లపహాడ్‌లో భారీ వర్షం కురియటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలో అత్యధికంగా 10.2సెంటీమీటర్లు, నాగారంలో 9.7సెంటీమీటర్లు, అత్యల్పంగా అనంతగిరి మండలంలో 0.5మిల్లీమీటర్ల వర్షం కురిసింది. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో అత్యధికంగా 5.2 సెంటీమీటర్లు, అత్యల్పంగా మోత్కూరులో 0.5మిల్లీమీటర్లు, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం నెమ్మానిలో అత్యధికంగా 1.5 సెంటీమీటర్లు, అత్యల్పంగా కట్టంగూరు మండలం అయిటిపాములలో 0.5మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో కురుస్తున్న వర్షం

బడి కోసం తండ్రీ, తనయుడు



కాలినడకన వెళ్తున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఆయన తనయుడు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని అల్వాల గ్రామంలో అధికారులతో కలిసి అనువైన స్థలం కోసం మంగళవారం పరిశీలించారు. 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సుమారు 2,500 మంది విద్యార్థులకు వసతి, భోజన, ఇతర సౌకర్యాలతో ప్రభుత్వం రూ.200 కోట్లతో నియోజకవర్గానికి ఒక పాఠశాలను నిర్మించనుంది.

● (ఆంధ్రజ్యోతి తిరుమలగిరి(సాగర్)

ఖజానా కోసం అందాల పోటీలా?

ఆలేరు, మే27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాను నింపడానికి సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో అందాల పోటీలు నిర్వహించడం ఎంతవరకు సబబని పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి. సంధ్య ప్రశ్నించారు. అందాల పోటీలను వ్యతిరేకిస్తూ సంఘం ఆధ్వర్యంలో యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళల అందాల పోటీలు నిర్వహించడం మహిళలను అవమానించమేనన్నారు. రాష్ట్రం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే మహిళలకు ప్రత్యేకంగా ప్రకటించిన రూ.2500తో పాటు ఇతర హామీలను అమలు చేయకుండా మహిళలను అవమానించడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు సీత, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు సుగుణ, జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ శశిరేఖ, నాయకురాలు గడ్డం పద్మ, సుగుణ, మాధవి, చిరబోయిన భద్రమ్మ, లక్ష్మీ, కొమ్మిడి లత, గడ్డం లక్ష్మీ, ఎర్ర మైసమ్మ, అనిత, బోయిని లక్ష్మీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య

క్లియో స్పోర్ట్స్ అకాడమీలో రాష్ట్ర స్థాయి సెలక్షన్స్

మిర్యాలగూడ టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని క్లియో స్పోర్ట్స్ అకాడమీలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక జూన్ 1, 2వ తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ తెలిపారు. అండర్-11, 13, 15, 17, 19 విభాగాల్లో బాల, బాలికలకు పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయికి ఎంపికచేస్తామన్నారు. ఎంబీఏ ఆధ్వర్యంలో జూన్ 1న అండర్-15, 17, 19 క్రీడాకారులకు, 2న అండర్ 11, 13 క్రీడాకారులకు పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీనియర్స్ విభాగంలోనూ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 35 ఏళ్ల నుంచి సీనియర్ సిటీజన్స్ వరకు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 9848959215, 9948052108 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంబీఏ డాక్టర్ ప్రశాంత్, నవీన్‌కుమార్, అంజయ్య పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, మే 27(ఆంధ్రజ్యోతి) యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్యకల్యాణం, నిత్యార్చనలు మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణీ వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.29,80,291ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, హైదరాబాద్ (మొయినాబాద్)లోని వీఐపీ భద్రత సిబ్బంది శిక్షణ కేంద్రంలో శిక్షణలో భాగంగా భద్రత సిబ్బంది యాదగిరిగుట్టకు వచ్చారు. వీవీఐపీ, వీఐపీ తాకిడి నేపథ్యంలో కొండపై సిబ్బంది ఆలయ పరిసరాలు పరిశీలించారు. ఐదుగురు శిక్షకులు, 57 సిబ్బంది రాగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తిరువీధుల్లో ఫోటోలు దిగారు.

అమావాస్య దర్శనం అదృష్టం : ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

లక్ష్మీ నరసింహ స్వామివారిని అమావాస్య దర్శనం అదృష్టంగా భావిస్తున్నానని పటాచెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. లక్ష్మీనరసింహ స్వామి వారి దర్శనార్థం మంగళవారం రేషన్ డీలర్ల సంఘం సభ్యులు, పార్టీ కార్యకర్తలతో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా స్వయంభువులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు.



క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి హారతి నివేదిస్తున్న అర్చకులు

సాయి ఆలయ వార్షికోత్సవాలు షురూ

● సాయినామస్మరణతో మార్మోగిన ప్రాంగణం



చింతపల్లి సాయి సన్నిధిలో హోమం చేస్తున్న అర్చకులు

చింతపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయ 18వ (అష్టాదశమ) వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ముక్కామల పీఠాధిపతి శ్రీధర్‌స్వామిజీ, ఛండీ ఉపాసకులు కొడకండ్ల రామ్‌చరణ్‌శర్మ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు ఛైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి వూరె కృష్ణయ్య, గోశాల ఇన్‌చార్జి కుంభం పుల్లారెడ్డి, సభ్యులు తడకమళ్ల శ్రీనివాస్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సీజన్‌కు విత్తనాలు సిద్ధం చేయాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రులు ఉత్తమ్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), సూర్యాపేట(కలెక్టరేట్),మే 27, (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగ వంతం చేసి వానాకాలం సీజన్‌కు విత్తనాలు, ఎరువులను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎన్.రేవం త్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్రమంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ రామకృష్ణారావుతో కలిసి వివిధ జిల్లాల కలెక్టర్లు , అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో నిర్వహించిన వీడి యో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. గతం కంటే దాదాపు 22లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా సివిల్ సప్లయ్ శాఖ తక్కువ సమయంలో కొనుగోలు చేసిందన్నారు. 90శాతం పైగా రైతులు ధాన్యాన్ని విక్రయించి సంతోషంగా ఉన్నప్పటికీ తెలంగాణకు రుతుపవనాలు ముందుగా వచ్చి న కారణంగా కల్లాల వద్ద ధాన్యం తడిసిపోవడంతో కొందరు రైతులు ఇబ్బందుల్లో ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్రంలో 10.50 లక్షల మంది రైతుల నుంచి 64లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేశామన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పనిచేస్తున్నప్పటికీ వ్యతిరేక వార్తలు వస్తున్నాయని వాటిని తిప్పికొట్టాలన్నారు.

నష్టపరిహారం కోసం నివేదిక పంపాలి

అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి పదివేల పరిహారం అందించేందుకు నివేదికలు పంపాలన్నారు. విత్తనాలు, ఎరువులు అక్రమంగా స్టాక్ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూన్ 3 నుంచి 20వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో ప్రభుత్వ పనితీరు కనిపిస్తుందన్నారు. కలెక్టర్లు, ఇన్‌చార్జి మంత్రులు ఈనెల 29, 30వ తేదీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వానాకాలం సాగు ఏర్పాట్లు, నకిలీ విత్తనాలు, ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతిపై నివేదిక తయారు చేసి జూన్ 1వ తేదీ నాటికి అందించాలన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. పౌరసరఫరా, భారీ నీటి పారుదశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గతేడాది యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యం కంటే ఈఏడాది 22లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా కొనుగోలు చేసినట్లు చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం 15శాతం మాత్రమే ప్రారంభమయ్యాయని, మిగిలిన ఇళ్ల పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. భూభారతి చట్టం కింద పైలట్ మండలాలల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యలను పరిష్కరించి జూన్ 2న పట్టాలు పంపిణీ చేయాలన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ వానాకాలం పంటల సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధం కావాలన్నారు. సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ పెండింగ్ ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో యాదాద్రి భువనగిరి జిల్లాలో డీఆర్‌డీవో అప్పారావు, సివిల్ సప్లయ్ డీఎం ప్రసాద్, డీసీవో పద్మ, హౌసింగ్ పీడీ ధర్మారెడ్డి సూర్యాపేటలో ఆర్డీవోలు క్రిష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీవో నాగిరెడ్డి, రోజారాణి, డీఎం హరిక్రిష్ణ, జేడీఏ గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సామగ్రి వెంటనే పంపిణీ చేయాలి

● రైతు సంఘం ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా



ట్రాన్స్‌కో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

మిర్యాలగూడ, మే 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ నుంచి వ్యవసాయానికి అవసరమైన మో టార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్‌శాఖ నుంచి సామగ్రి మంజూరైనప్పటికీ రైతులకు అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత సీజన్‌లోనే వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు రైతులు డీడీల రూపేణా డబ్బులు చెల్లించి విద్యుత్ సామాగ్రి కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఏడాది కాలం పూర్తయినా ఇప్పటి వరకు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించలేదని అన్నారు. ముఖ్యంగా నల్లగొండ స్టోర్‌లో విద్యుత్ సామగ్రి పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. రైతులకు లైన్ మంజూరై, వర్క్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ మెటీరియల్ లేక విద్యుత్ పనులు ప్రారంభం కావడం లేదన్నారు. ఈ విషయమై అధికారులను ప్రశ్నిస్తే కాంట్రాక్టర్లను అడగాలని సమాధానం ఇస్తున్నారని అన్నారు. కాంట్రాక్టర్లు మెటీరియల్ ఇవ్వడం లేదని వాపోతున్నారని అన్నారు. ఓఆర్సీ కింద దరఖాస్తు చేసుకున్న విద్యుత్ స్తంభాలు ఇవ్వడం లేదని అన్నారు. తక్షణమే విద్యుత్ మోటారు లైన్లు మంజూరైన రైతులకు మెటీరియల్ అందించి కరెంటు కష్టాలు తొలగించాలని కోరారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు మల్లు గౌతంరెడ్డి, బావాండ్ల పాండు, రవినాయక్, రైతు సంఘం జిల్లా నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి, గోవిందరెడ్డి, గోవర్ధనా, సైదమ్మ, వెంకట్‌రెడ్డి, కందుకూరి రమేష్, పిల్లుట్ల సైదులు, నాగుల, హుస్సేన్, చౌగాని వెంకన్న, నాగేశ్వరరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అదే ఉత్కంఠ !

(5వపేజీ తరువాయి)

ఖాయమనే అభిప్రాయాలు పార్టీలో వెల్లడవుతున్నాయి. మరోవైపు మంత్రి పదవికి బలంగా పోటీపడుతున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్‌కు సైతం క్యాబినెట్ హోదాతో కీలక పదవి దక్కనుందని తెలుస్తోంది.

పీసీసీలోనూ జిల్లా నేతలకు కీలకపదవులు!

పీసీసీ కార్యవర్గంలోనూ వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్షుడు, ప్రధానకార్యదర్శుల పదవులకు ఉమ్మడి జిల్లాకు చెందిన కీలకనేతల పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తోంది. ఎంపీలు, ఎమ్మెల్యేలకు పదవులు ఇవ్వడం ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలనే అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా ఆయా పదవులిస్తే, జిల్లాకు చెందిన నేతలు ఏ మేరకు పార్టీకి పనిచేస్తారనే అంశంపై ఆరా తీస్తున్నట్లు పార్టీ నాయకుల్లో చర్చ సాగుతోంది. పార్టీ ఉపాధ్యక్ష పదవికి నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి పేరు ఖరారైనట్లు పార్టీలో చర్చ సాగుతోంది. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల నేతలకు ఒక్కొక్కరికి అవకాశం కల్పించాలని నిర్ణయించిన మేరకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ పేర్లపైనా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

అదేవిధంగా పీసీసీ ప్రధాన కార్యదర్శులుగా, సంయుక్త కార్యదర్శులుగా ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక నేతల పేర్లతో జాబితా సిద్ధమైందని చెబుతున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్ల ఎంపికనే మిగిలిందని, మిగిలిన పదవులపై జాబితా సిద్ధమైందని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఆమోదముద్ర పడ్డ వెంటనే పార్టీ పదవుల జాబితా విడుదలవుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఉమ్మడి జిల్లాకు మరో నాలుగు

(5వపేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే నల్లగొండ, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్, నాగార్జునసాగర్, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూళ్లకు నిధులు మంజూరవగా, తాజాగా నాలుగు నియోజకవర్గాలకు పరిపాలనా అనుమతులు వచ్చాయి. తాజా జీవోతో మొత్తం 12 నియోజకవర్గాలకు సూర్యాపేట మినహా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు యంగ్ ఇండియా స్కూళ్లు దక్కాయి. అయితే గతంలో మంజూరైన స్కూళ్లకు సంబంధించి ఏడింటికి ఒక్కచోట కూడా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. తాజాగా వచ్చిన నాలుగు స్కూళ్లను కలిపి మొత్తం 11 స్కూళ్లకు భూసేకరణ పూర్తిచేయడంతో పాటు, టెండర్లు ఖరారు చేసి పనులు వేగవంతంగా ప్రారంభిస్తే వచ్చే విద్యాసంవత్సరం నాటికైనా అందుబాటులోకి వస్తాయి. కాగా, పాఠశాలల మంజూరుపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, నేనావత్ బాలూనాయక్, బత్తుల లక్ష్మారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

పంట మార్పిడితో భూసారం పెంపు

తుర్కపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి) : పంట మార్పిడితో భూసారం పెరుగుతుందని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఉద్యాన శాస్త్ర విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ కే.చైతన్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు ముంగిట్లో -శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంపై రైతులకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా యూరియా వినియోగాన్ని తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. పంట దిగుబడి రావాలని అధిక రసాయన ఎరువులు వాడితే పంటచేళ్లతో పాటు నేల దెబ్బతిం టుందని అన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అరికట్టడానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లో కొనుగోపి చేసి తప్పని సరిగా రశీదు తీసుకోవాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలను రైతులుపంటలకు సంబంధించి పలు విషాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి రామారావు, ఏవో శ్రీ ఉమ, డాక్టర్ సిహెచ్. రమ్య శ్రీ, కళాశాల విద్యార్థులు చంద్రహాస్, ఎస్. ప్రణతి, ఏఈవోలు ఎ. జెస్సీ, తిరుమలరావు, రైతులు నరేందర్‌రెడ్డి, రాంరెడ్డి, జి. దుప్‌సింగ్, బాలమల్లేశ్, మాదవయ్య, ఎం. రాజయ్య, పి. వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

GOVERNMENT OF TELANGANA
TELANGANA MEDICAL SERVICES & INFRASTRUCTURE DEV. CORPORATION
(AN ENTERPRISE OF GOVT. OF T.G.)
Office of the Executive Engineer, TGMSIDC, Special Division, Opp:Hanuman Temple, Railway station Road, Nalgonda
Ph.No.08682-228252 : email: eenlgtsmsidc@gmail.com
Tender Notice No.02/EE/TGMSIDC/Spl.Divn/Nlg/2025-26 Dated:26.05.2025.
The Executive Engineer, TGMSIDC NALGONDA Division invites Tender for "Providing Infrastructure and Furniture to SADAREM Camp in GGH Suryapet in Suryapet District". Further details can be viewed at http//tender.telangana.gov.in or contact in Office Phone No. (08682) 228252.
Sd/- EXECUTIVE ENGINEER

శాపల్లిలో నేటినుంచి నవగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

నార్కట్‌పల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): శాపల్లిలోని కమలాద్రి లక్ష్మీనరసింహ్మ స్వామి దేవస్థానంలో ఈనెల 28 నుంచి 30 వరకు నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అనువంశిక అర్చకుడు కారంపూడి నర్సింహ్మాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 28న గణపతి పూజ, పుణ్యాహ వాచనం, విగ్రహాలకు అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసం, 29న మూల మంత్ర హోమాలు, ధాన్య పుష్ప, శయ్యాధి వాసాలు, 30న నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు.

నేడు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ ప్రమాణస్వీకారం

చిట్యాల, మే27,(ఆంధ్రజ్యోతి): చిట్యాల వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం బుధవారం జరగనున్నట్లు మార్కెట్ కార్యదర్శి జానయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే హాజరవుతారని తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మించిన దుకాణ సముదాయాన్ని మంత్రులు ప్రారంభిస్తారని తెలిపారు.

సమాచారం

టెండర్లకు అనుమతి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రామగిరి, మే 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వివిధ వరదకాల్వల్లో పూడిక తీసేందుకు ప్రత్యేక కలెక్టర్ నుంచి అనుమతి లభించింది. 'పూడిక తీసేనా' శీర్షికన ఈనెల 25న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి మునిసిపల్ అధికారులు స్పందించారు. ప్రత్యేకంగా స్పెషల్ కలెక్టర్ కలిసి వరదల కాల్వల ముప్పుపై వివరించి పూడిక తీసేందుకు అనుమతులు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పెషల్ కలెక్టర్ విషయాన్ని పరిశీలించి పూడిక తీసేందుకు అనుమతిచ్చారు. దీంతో మునిసిపల్ అధికారులు రెండురోజుల్లో టెండర్లను పిలువనున్నారు.

దైవ చింతన కలిగిఉండాలి



కట్టంగూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని పరడ గ్రామంలో మంగళవారం జరిగిన ఎల్లమ్మ పండుగ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవాలయాలభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా గ్రామాలల్లోని యువత భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, నాయకులు పుట్ట నర్సింహారెడ్డి, సురేందర్, శంకర్, శ్రీకాంత్, రవి తదితరులు ఉన్నారు.

దేవాలయ భూముల కౌలుకు రేపు వేలం

నల్లగొండ కల్చరల్, కనగల్, మే 27 (ఆంధ్రజ్యోతి): కనగల్లు మండలం యం. గౌరారం శివారులోగల మారేపల్లి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన వ్యవసాయ భూములను ఏడాదికి కౌలు నిమిత్తం బహిరంగ వేలం ఈనెల 29వ తేదీన ఉదయం 8 గంటలకు రైతు వేదికలో నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఏసీ భాస్కర్, ఆలయ ఈవో అంబటి నాగిరెడ్డి మంగళవారం ఒక ప్రకటలనో తెలిపారు. ముందుగా రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు 9959198949 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గోపలాయపల్లి గుట్టపై సుదర్శన హోమం

నార్కట్‌పల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో హరిహర క్షేత్రంగా విరాజిల్లుతున్న గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో మంగళవారం సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ప్రతీ మాసం రోహిణీ నక్షత్రాన్ని పురస్కరించుకుని లోకకల్యాణార్థం స్వామివారికి సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, పలువురు దంపతులు హోమ గుండం వద్ద కూర్చున్నారు.

పీఏసీఎస్ భవనం ఏర్పాటుకు స్థల పరిశీలన

కనగల్, మే 27: (ఆంధ్రజ్యోతి) కనగల్ ప్రాథమిక సహకార పరపతి సంఘం కార్యాలయ నూతన భవనం ఏర్పాటు కోసం సంబంధిత అధికారులు ఇటీవల కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి ఎస్ఎల్‌బీసీ క్వాటర్స్‌లోని స్థలాన్ని స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పీఏసీఎస్ భవనంతో పాటు, గోదాం నిర్మాణం కోసం 16 గుంటల స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు త్వరలో అందజేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ, ఆర్ఐ యాదగిరి, పీఏసీఎస్ సీవో రాంచంద్రారెడ్డి, మాజీసర్పంచ్‌గోలి నర్సిరెడ్డి, సిబ్బంది మహేశ్వరం గిరి, గోగు శంకర్ ఉన్నారు.

టెండర్లు పిలిచారు.. విస్తరణ మరిచారు

● ప్రారంభంకాని దోరెపల్లి రోడ్డు పనులు ● నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు ● అధికారుల అలసత్వంపై ప్రయాణికుల అసంతృప్తి

కనగల్, మే 27:(ఆంధ్రజ్యోతి): కనగల్ మండలంల రోడ్ల విస్తరణ, మరమ్మతులు ముందుకు సాగడం లేదు. రోడ్డు విస్తరణకు టెండర్లు పిలిచినా పనులు మొదలు కాలేదు. వివిధ రూట్లలోని రోడ్లు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. గుంతలు పడి, కంకర తేలి ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ నియోజకవర్గంలోని రోడ్లపై దృష్టి సారించారు. మండలంలోని రోడ్ల విస్తరణ, మరమ్మతులకు కోట్లాది రూపాయలు మంజూరు చేయించారు. ప్రభుత్వం టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. పనుల ప్రారంభంలోనే జాప్యం జరుగుతోందని, రోడ్డు పనులు జరిగేది ఎప్పుడు, ప్రయాణికుల కష్టాలు తీరేది ఎన్నడని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతోందని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. టెండర్లు పూర్తి అయినా పనులు చేపట్టని వాటిల్లో రూ.27 కోట్లతో దోరెపల్లి స్టేజీ నుంచి కురంపల్లి వరకు 11.8 కిమీ పొడవునా డబుల్‌రోడ్డు విస్తరణ, రూ.14 కోట్లతో కనగల్ ఎక్స్‌రోడ్డు నుంచి తిమ్మన్నగూడెం స్టేజీ వరకు ఐదు కిలో మీటర్ల పొడవునా డబుల్ రోడ్డు పనులు, రూ.8.5 కోట్ల నిధులతో కనగల్ జంక్షన్‌విస్తరణ పనులు ప్రారంభం కాలేదు. రూ.37 కోట్ల నిధులతో చేపట్టనున్న పగిడిమర్రి బ్రిడ్జి, రోడ్డు పనులు, నల్లగొండ మండలం నర్సింగ్‌బట్ల నుంచి రేగట్టే మీదుగా కురంపల్లి వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. దర్వేశిపురం స్టేజీ నుంచి సాగర్‌రోడ్డు వరకు బీటీ రోడ్డు ఏర్పాటు, తుర్కపల్లి యాచారం రోడ్డు విస్తరణ ప్రతిపాదనలతో సరిపెట్టారు.



దర్వేశిపురం వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ఆర్‌అండ్‌బీ ఏఈ పోస్టు ఖాళీ

పనులు పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ ఏఈ, జేఈ ఇటీవల బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వీరి స్థానంలో కొత్తవారిని ఇక్కడికి పంపలేదు. ప్రస్తుతం సదరు ఏఈ పోస్టు ఖాళీగా ఉండగా మండల స్థాయిలోని రోడ్ల సమస్యలను ఎవరికి విన్నవించాలో తెలియడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

నకిలీ విత్తనాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ, మే 27(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా అనుమానాలు ఇస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని వన్ టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఆరు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనగల్: రైతులకు నకిలీ విత్తనాలు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని చండూర్ సీఐ ఆదిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం కనగల్ ఎక్స్ రోడ్డులోని అన్నదాత ఎరువుల దుకాణం, అగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తని ఖీ చేశారు. దుకాణదారులను అడిగి స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. లైసె న్స్‌తో పాటు, రికార్డులను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ రైతులు దళా రులను నమ్మి మోసపోవొద్దన్నారు. లైసెన్స్ గల దుకాణాల్లోనే విత్తనాలు, ఎరు వులు మందులను కొనుగోలు చేయాలన్నారు. విత్తన సంచులపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి సమగ్ర వివరాలను సరి చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన మందులు, ఎరువులు, విత్తనాలకు రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ విష్ణుమూర్తి, ఏఈఓలు నవీన్ మౌనిక తదితరులున్నారు.

కట్టంగూరు: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కట్టంగూరు ఎస్ఐ రవీందర్ హెచ్చరించారు. కట్టంగూరులో మంగళవారం ఎరువుల దుకాణాలను, పురుగుల మందులు విక్రయించే దుకాణాలను కట్టంగూరు ఏవో గిరిప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలని కష్టపడి పనిచేసే రైతుకు నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత డీలర్లదే అన్నారు.



నల్లగొండలోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

మర్రిగూడ: ఎరువుల దుకాణాల్లో పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన అనం తరం రైతులు ఆయా దుకాణాల యజమానుల నుంచి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సహాస్ అన్నారు. మంగళవారం మర్రిగూడ వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ 22 ఎరువుల దుకాణాలు ఉన్నాయని ప్రస్తుతం 15వేల పత్తి విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అనుమానంగా ఉన్న ఫెర్టి లైజర్ షాపులకు వెళ్లి తనిఖీలు చేశామని, ఆ షాపుల్లో పత్తి విత్తనాలను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

అప్రమత్తతే ఆయుధం

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆసుపత్రిలో ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ మాతృనాయక్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రకాష్ తెలిపారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతిరోజు 700 నుంచి 800వరకు రోగులు చికిత్స కోసం వస్తుంటారు. వర్షాకాలం ప్రారంభంకావడం, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 10 ఆక్సిజన్ సిలిండర్లు ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ ప్లాంట్ సైతం ఉంది. దీంతోపాటు ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాలమేరకు ప్రత్యేక పడకలు ఏర్పాటు చేశారు. ఐసీయూ బెడ్లు కూడా అందుబాటులో ఉన్నాయి. పీపీ కిట్లు, శానిటేషన్, మాస్కులు కూడా సిద్ధం చేశారు.

● మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి వైద్యులు కొవిడ్-19 సందర్భంగా సమకూర్చిన వసతులను తిరిగి అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు ప్రారంభించారు. 2020లో కొవిడ్ కేసుల తీవ్రతను పరిగణించి 100 పడకలతో విస్తరించిన ఏరియా ఆస్పత్రిని కొవిడ్ ఆస్పత్రిగా మార్చి ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక గదులకు అనుసంధానంగా ఆక్సిజన్‌ప్లాంటును సైతం ఏర్పాటు చేశారు. అప్పట్లో సమకూర్చిన వసతులన్నింటినీ తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు వైద్యాధికారులు సన్నద్ధమవుతున్నారు. మిర్యాలగూడకు సరిహద్దులో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, ఏటూరు, నెల్లూరు జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు నమోదైన క్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎండీ) వైద్యారోగ్యశాఖను అప్రమత్తం చేసింది. ఏపీ రాష్ట్రంలోని గుంటూరు నుంచి మిర్యాలగూడకు వ్యాపార, వాణిజ్య

లావాదేవీలు కొనసాగింపులో భాగంగా ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుత పరిస్థితిలో ప్రజలు అనుసరించాల్సిన వ్యక్తిగత జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు వైద్యులు సిద్ధమయ్యారు. కొవిడ్ వ్యాప్తిని అరికట్టేందుకు అనుసరించాల్సిన నియమ, నిబంధనలపై ప్రజలను చైతన్యపరిచేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై క్షేత్రస్థాయి సిబ్బందికి మౌఖిక ఆదేశాలు జారీచేశారు. మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి గైనిక్ విభాగంలోని కొవిడ్‌వార్డును ప్రస్తుతం ప్రసవాల వార్డుగా వినియోగిస్తున్నారు. పరిస్థితిని బట్టి కొవిడ్ వార్డుగా మార్చి తిరిగి వినియోగంలో తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ సమరద్ తెలిపారు. కేసులను ఎదుర్కొనేందుకు తమ సిబ్బంది అన్ని విధాలా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రజలు వ్యక్తి జాగ్రత్తలు తీసుకుంటూ జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లోకి మాస్కులు ధరించి వెళ్లడం అన్ని విధాల శ్రేయస్కరమని,బ జిల్లాలో ప్రస్తుతం కొవిడ్ ప్రభావం లేదని ప్రజలు భయాందోళన చెందకుండా వ్యక్తిగత జాగ్రత్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.



దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన బెడ్లు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

నాంపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు దాచేపల్లి నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పేదలను కాకుండా అధికార పార్టీ కార్యకర్తలను ఎంపిక చేశారని ఆరోపించారు. మండలంలో పూర్తిగా అన్ని గ్రామాల్లో రాజకీయ కోణంలో లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. గ్రామాల్లో అధికారులు నామ మాత్రంగా సర్వే నిర్వహించి ఆమోదించారన్నారు. అధికారులు కూడా ఇందిరమ్మ ఇళ్ల జాబితాలు రహస్యంగా ఉంచారని చర్చజరుగుతోందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే అధికారులను ఆదేశించి గ్రామ సభలు నిర్వహించి అసలైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాంపల్లి సతీస్, పంగ ఈశ్వర్, తిప్పని శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సింహ

సోమేశ్వర శివజ్ఞాన పీఠంలో పూజలు

నార్కట్‌పల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు శివారులోని సోమేశ్వర శివజ్ఞాన పీఠంలో అమావాస్య తిథిని పురస్కరించుకుని మంగళవారం పంచముఖ రామలింగేశ్వర స్వామికి మహాహారతి కార్యక్రమాన్ని అభిషేకాలను నిర్వహించారు. అనంతరం భక్తులు, దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ గావించారు. ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని యాదాద్రి దేవస్థాన విశ్రాంత ముఖ్య అర్చకుడు కారంపూడి నర్సింహ్మాచార్యులు ప్రారంభించారు. పీఠంలో జరిగే ఉత్సవ పూజలకు హాజరైన కారంపూడి నర్సింహ్మాచార్యుల దంపతులను పీఠం అధ్యక్షురాలు పోతుల పాటి రామలింగేశ్వరశర్మ అరుణ దంపతులు సన్మానించారు. కార్యక్రమంలో పీఠం బాధ్యులు నందనం హరికిషన్ శర్మ, రాజేందర్‌శర్మ, జయారపు రామకృష్ణ ఉన్నారు.

ముగిసిన ధ్యానం కొనుగోళ్లు

మర్రిగూడ, మే 27 (ఆంధ్రజ్యోతి): శివన్నగూడ వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ముగిసినట్లు ఆ సంఘం చైర్మన్ బాలెం నరసింహ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సొసైటీ ద్వారా కుదాభక్షపల్లి, శివన్నగూడలో రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 220మంది రైతుల నుంచి 10,677క్వింటాళ్ల ధాన్యం సేకరించి కొనుగోలు చేసి 37 లారీల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు ఆయన తెలిపారు.

ఇద్దయ్య మృతి సీపీఐకి తీరని లోటు



ఇద్దయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గట్టుప్పల్, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు వరికుప్పల ఇద్దయ్య మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ మండల కార్యదర్శి బీమనపల్లి రమేష్ అన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన ఇద్దయ్య పార్థీవ దేహంపై పార్టీ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఇద్దయ్య అనేక పోరాటాలు చేశాడని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కారింగ్ శ్రీను, ధనుంజయ్, దుబ్బాక బజార్, మొద్దు రాములు, కొండపల్లి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

శాలిగౌరారం, మే 27 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తున్న పాడి గేదె విద్యుత్ వైర్లు కాళ్లకు తగిలి కాల్వలో పడి విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని రామాంజపురం గ్రామంలో మంగళవారం జరిగింది. మండలంలోని రామాంజపురం గ్రామంలో కల్లెపల్లి నర్సయ్యకు చెందిన గేదె గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ప్రక్కన ఉన్న కాల్వలో పడి మృతిచెందింది.

ఇష్టానుసారంగా స్పీడ్ బ్రేకర్లు

నల్లగొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని రామగిరి టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన వీధితో పాటు అయ్యప్ప గుడి పక్కన వీధిలో ఇష్టారాజ్యంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ వీధుల్లో పాఠశాలలు, రద్దీగా ఉండే కార్యాలయాలు లేకున్నా కొందరు ఎత్తైన స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. వాహనదారులు వేగంగా వెళ్లుతున్నారని భావిస్తే చిన్నపాటి స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ కొందరు తమకు తోచిన విధంగా భారీ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఇతర భారీ వాహనాలు వెళ్లడానికి సమస్యగా మారింది. స్పీడ్ బ్రేకర్‌లు ఎత్తుగా ఉండటంతో వాహనాల అడుగు భాగానికి తగిలి వాహనాలు దెబ్బతింటున్నాయి. దీనికి తోడు ద్విచక్రవాహనంపై ఉన్నవారు పలుమార్లు కింద పడి గాయాల పాలవుతున్నారు. వాహనాలు నడిపే మహిళలు సైతం ఈ స్పీడ్ బ్రేకర్లతో ఎదుర్కొంటున్నారు. మునిసిపాలిటీకి చెందిన చెత్త వాహనాలు ఈ స్పీడ్ బ్రేకర్‌లు దాటిన సమయంలో వాహనంలోని చెత్త చెదారమంతా తిరిగి ఆ వీధులోనే పడుతుండడంతో వీధుల్లో చెత్త, చెదారం పేరుకుపోతుంది.



రామగిరిలో అడ్డగోలుగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి



చిట్యాల మండలం సుంకెనపల్లిలో వ్యవసాయ అధికారి గిరిబాబు

చిట్యాలరూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాలు అందక బోర్లు ఎండిపోయిన రైతులు వర్షాభావ పరిస్థితుల సమయాల్లో రైతులు ఒకే వరి పంట సాగుపై ఆధారపడకుండా అధిక దిగుబడులందించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిని సారించాలని మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు సూచించారు. ఆరెగూడెం, సుంకెనపల్లి, ఉరుమడ్ల, చిన్నకాపర్తి గ్రామాల్లో మంగళవారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. దిగుబడులు రాక ఆందోళన చెందే రైతులు మారుతున్న పరిస్థితులకనుగుణంగా తక్కువ నీటి సామర్థ్యంతో సాగుచేసుకునేందుకు ఎన్నో పంటలున్నాయని కంది, జొన్న, వేరుశనగ, ఆముదము, ప్రొద్దుతిరుగుడు, తృణధాన్యాల వంటి పంటలు వేసుకుని వర్షాభావ పరిస్థితుల నుంచి బయట పడాలన్నారు. సదస్సులో ఏఈఓలు వీణాకుమారి, కృష్ణకుమారి, వాసుదేవ్, మనీషా, శశాంక పాల్గొన్నారు.

మర్రిగూడ, మే 27 (ఆంధ్రజ్యోతి): వరి, పత్తి ప్రత్యామ్నాయంగా ఇతర పంటల ద్వారా భూసారం పెంచుకోవచ్చనని మునుగోడు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు మర్రిగూడ మండల స్పెషల్ అధికారి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మర్రిగూడ రైతు వేదికలో రైతులకు ఆరుతడి పంటలు, పంటల మార్పిడిపై అవగాన సదస్సు నిర్వహించారు. రైతులు పంటలు మార్పిడి ద్వారా భూసారం పెంచుకోవడంతో పాటు ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈసందర్భంగా రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి సహాస్, వ్యవసాయ విస్తరణాధికారులు పి.విజయ్ కుమార్, జి.సుజాత, శ్రీలత, నాగస్వాతి, అరుణ రైతులు పాల్గొనడం జరిగింది.

సన్న రకం వరిని సాగు చేయాలి

కనగల్ : రైతులు సన్న రకం వరి సాగును చేపట్టాలని ఏవో అమరేందర్‌గౌడ్ సూచించారు. పర్వతగిరి గ్రామంలో పంటల మార్పిడి సాగుపై రైతులకు మంగళవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సన్న రకం వరి దాన్యానికి ప్రభుత్వం రూ.500ల బోనస్‌ను చెల్లిస్తుందన్నారు. రైతులు ఎప్పటికప్పుడు పంటల మార్పిడిని చేయాలన్నారు. అంతర పంటగా. కందిని సాగు చేస్తే భూసారం పెరుగునన్నారు. తద్వారా పంటల ఉత్పత్తి పెరిగి రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నవీన్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



కేతేపల్లిలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి పురుషోత్తం

భూమి అనుకూలతను బట్టి పంటలు సాగు చేయాలి


కేతేపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): భూమి అనుకూలతను బట్టి పంటలు సాగు చేయడం రైతులకు లాభదాయకమని మండల వ్యవసాయ అధికారి బి. పురుషోత్తం సూచించారు. పంట మార్పిడి విధానంపై మండలంలోని ఇనుపాముల, కేతేపల్లి, కొప్పోలు గ్రామాల్లో రైతులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో మాట్లాడారు. ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి, పంటల స్థానంలో ఆయా భూముల అనుకూలత మేరకు కంది, ఆకు కూరలు, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి పంటలు పండించే దిశగా దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఇలా పంట మార్పిడి విధానంతో భూసారం పరిరక్షించబడుతుందన్నారు. పత్తి విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దళారుల మాటలకు మోసపోయి నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు బాలరాజు, ఉమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి

***

ANDHRAJYOTHY



'గమ్యం' చూపుమా

- కొన్ని రోజులుగా అందని ఆర్టీసీ గమ్యం యాప్ సేవలు
- కొన్ని డిపోల బస్సుల వివరాలకే పరిమితం
- డివైజ్ ఉన్నా కొన్ని బస్సుల్లో పనిచేయని వైనం



7



ఉమ్మడి జిల్లాకు

మరో నాలుగు

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

ఒక్కో స్కూల్‌కు రూ.200కోట్లు కేటాయిస్తూ జీవో

సూర్యాపేట మినహా అన్ని నియోజకవర్గాలకు కేటాయింపు



నల్లగొండ, మే 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్‌ను ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మరో నాలుగు నియోజకవర్గాలకు మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా జీవో 96 విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 స్కూళ్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయగా, అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నాలుగు దక్కాయి. జీవోలో పేర్కొన్న ప్రకారం యాదాద్రి జిల్లాలోని ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలకు, నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ, దేవరకొండ (ఎస్టీ) నియోజకవర్గాల్లో ఈ నాలుగు స్కూళ్లకు బిల్డింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. అందుకోసం ఒక్కో స్కూల్‌కు రూ.200కోట్ల నిధులు వెచ్చిస్తారు. రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ ప్రతిపాదనల మేరకు ఈ నిధులతో పరిపాలనా అనుమతులు మంజూరుచేస్తున్నట్లు, నిర్మాణాల నిమిత్తం టీజీఈడబ్ల్యూఐడీసీ తదుపరి చర్యలు తీసుకోవాలని జీవోలో...

- మిగతా 7వ పేజీలో...

ఉమ్మడి జిల్లాకు మూడో మంత్రి పదవి కేటాయింపుపై ఉత్కంఠ కొనసాగుతోంది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఢిల్లీ పర్యటన సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మంత్రిపదవిపై అధిష్ఠానం స్పష్టత ఇచ్చిందనే సంకేతాలు వెలువడుతుండగా, మరోవైపు పీసీసీ కార్యవర్గంలోనూ ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక నేతల పేర్లను పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమంటున్న క్యాడర్
- అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందనే సంకేతాలు
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్ష పదవులకూ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేల పేర్ల పరిశీలన
- కీలకమైన నియామకాలు పూర్తయితే నామినేటెడ్ పదవుల పందేరం



అదే ఉత్కంఠ

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు కీలక భూమిక పోషించిన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అటు ప్రభుత్వంలో, ఇటు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడాన్ని తప్పుబట్టాల్సిందేమీలేదని, పార్టీకి వెన్నుముకలా నిలిచిన జిల్లా నేతలకు పదవులు ఇవ్వాల్సిందేననే డిమాండ్ క్యాడర్‌లో బలపడుతోంది. జిల్లాలు, సామాజిక సమీకరణాలు,వర్గాల పేరుతో పదవులకు దూరంపెట్టడం సమంజసం కాదని, సమర్థత, క్లిష్ట సమయాల్లో పార్టీకి అండగా ఉన్న నేతలకు పదవులిస్తేనే పార్టీకి ఊతమిచ్చినట్లు అవుతుందనే చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులతో పాటు, కార్యవర్గాన్ని తొలుత ప్రకటిస్తారని, ఆ జాబితా వెలువడితే క్యాబినెట్‌లో ఎవరికి అవకాశం దక్కుతుందనే అంశంపై స్పష్టత వస్తుందని పార్టీవర్గాలు భావిస్తున్నాయి.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖరారయిందనే సంకేతాలు

పీసీసీ కార్యవర్గం ఏర్పాటుతో పాటు, క్యాబినెట్ విస్తరణపై తాజాగా ఢిల్లీలో ఏఐసీసీ అధిష్ఠానం సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో నిర్వహించిన చర్చల సందర్భంగా పీసీసీ కార్యవర్గంతో పాటు, క్యాబినెట్ విస్తరణలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఒక దశలో ఆయన పేరును పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి పరిశీలిస్తున్నారనే లీకులు వచ్చినప్పటికీ క్యాబినెట్ పదవికే మొగ్గుచూపినట్లు సమాచారం. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి క్యాబినెట్ విస్తరణలో అవకాశం కల్పిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిందని, ఈ నేపథ్యంలోనే ఆయనకు మంత్రి పదవిని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే అందుబాటులో లేకపోవడంతో ఆయనతో ఈ నెలాఖరులో లేదా జూన్ మొదటివారంలో సమావేశమయ్యాక చివరగా పార్టీ లోక్‌సభాపక్షనేత రాహుల్‌గాంధీ ఆమోదం మేరకు మంత్రివర్గ విస్తరణపై తుది నిర్ణయం ఉంటుందని, విస్తరణ ఎప్పుడు జరిగినా రాజగోపాల్‌రెడ్డికి మంత్రిపదవి రావడం...

- మిగతా 7వ పేజీలో...

పార్టీ పదవుల అనంతరమే నామినేటెడ్ పదవులు

మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గ ఏర్పాటు, డీసీసీల నియామకాలు పూర్తయితేనే నామినేటెడ్ పదవుల నియామకం చేపట్టేందుకు లైన్‌క్లియర్ అవుతుందని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు, కమిషన్లలో సభ్యులుగా కొందరికే అవకాశం దక్కగా, ఉమ్మడి జిల్లా నుంచి ఇంకా పలువురు కీలక నాయకులు ఈ పదవుల కోసం హామీలు పొంది ఎదురుచూస్తున్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు, కీలకమైన యాదగిరిగుట్ట ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులుగా అవకాశం పొందేందుకూ పెద్ద సంఖ్యలో నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. వీటితో పాటు జిల్లాల స్థాయిలో ఉండే మహిళా ఆర్గనైజర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులు, మిర్యాలగూడ వంటి కీలకమైన మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కించుకునేందుకు పోటీపడుతున్న నేతలు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తున్నారు.



అప్రమత్తతే.. ఆయుధం



కరోనా వైరస్‌పై ప్రభుత్వం అలర్ట్‌గా ఉంది. పొరుగున ఉన్న రాష్ట్రాల్లో కొత్తగా పాజిటివ్ కేసులు నమోదవుతుండడంతో ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా వైద్యశాఖ అప్రమత్తమైంది. దేశంలో అక్కడక్కడ పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. అయితే ఇప్పటివరకు నిర్వహించిన జన్యుపరిణామక్రమ విశ్లేషణ ప్రకారం ఈ వైరస్ ఒమిక్రాన్ ఉప వేరియంట్‌గానే తేలినట్లు ఐసీఎంఆర్ ప్రకటించింది. ప్రజలు సాధారణంగా తీసుకునే నియంత్రణ చర్యలు తప్పితే కొత్తగా తీసుకోవాల్సిన అవసరం లేదని వెల్లడించింది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉందని భావిస్తే వైద్యుల సూచన మేరకు బూస్టర్‌డోస్‌లు తీసుకోవాలని, మిగతావారికి అవసరం లేదని ప్రకటించింది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

- కొవిడ్‌పై ప్రభుత్వం అలర్ట్
- ఈ వేరియంట్‌తో పెద్దగా ముప్పు ఉండబోదన్న ఐసీఎంఆర్
- సాధారణంగా తీసుకునే నియంత్రణ చర్యలు చాలు
- గతంలో తీసుకున్న వ్యాక్సినేషన్‌తోనూ పెరిగిన వ్యాధి నిరోధకత
- వదంతులు నమ్మవద్దని వైద్యశాఖ సూచన

నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): కరోనా కేసులు నమోదవుతున్నాయనే వార్తల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. అయితే ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదు. సాధారణ జ్వరాలు, దగ్గు, జలుబు తప్ప ఎవ్వరికీ కరోనా లక్షణాలు లేవని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది.

వదంతులు వ్యాప్తిచెందకుండా చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల అనంతరమే కరోనాపై మాట్లాడాలి తప్ప సొంతంగా అధికారులు ఎలాంటి ప్రకటనలు చేయవద్దని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని సూచించింది. సాధారణంగా వచ్చే జలుబు, జ్వరం,దగ్గుకు ప్రజలు భయాందోళనకు గురి కావద్దని,అవి కరోనాతో వచ్చాయని భావించి భయపడాల్సిన అవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు. కరోనాఅంటూ ఎవరైనా ప్రచారం నిర్వహిస్తే చర్యలుంటాయని హెచ్చరిస్తున్నారు. ఇదిలాఉండగా, ఉమ్మడి జిల్లాలో ఆక్సిజన్ నిల్వలు,పడకలు, అవసరమైన మందులు, మాస్కులు, ఆర్టీపీసీఆర్ పరీక్షల కిట్‌లు, ఇతర సామగ్రి, వైద్యసిబ్బంది ఎంత అవసరం అనే విషయాలపై నివేదిక అందించాలని ప్రభుత్వం సూచించింది. కరోనాను ఎదుర్కొనేందుకు దేవరకొండ...

- మిగతా 8వ పేజీలో...

కరోనాను అరికట్టేందుకు అన్ని చర్యలు



కరోనా మహమ్మారిని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆసుపత్రులకు ముందస్తుగానే ఆక్సిజన్, ఐసీయూ, పీపీ కిట్లు, మాస్కులు, మందులు అందుబాటులోకి వచ్చాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మాస్కులు ధరించాలి. చేతులు కలపవద్దు. జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. జిల్లా కేంద్రంతో పాటు అన్ని ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

- డాక్టర్ పుత్యనాయక్, డీసీహెచ్

నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో మోకాలిచిప్ప మార్పిడి శస్త్రచికిత్స

మొదటిసారి విజయవంతంగా నిర్వహించిన వైద్యులు



జిల్లా ప్రధానాసుపత్రిలో మోకాలిచిప్ప మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న వజ్జ ఎర్రయ్యతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, ఆర్థోపెడిక్ డాక్టర్ల బృందం

నల్లగొండ, మే 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండలోని ప్రభుత్వ ప్రధానాస్పత్రికి చెందిన ఐదుగురు వైద్యుల బృందం మొదటిసారిగా మోకాలిచిప్ప మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. మంగళవారం నల్లగొండ మండలం చర్లపల్లికి చెందిన వజ్జ ఎర్రయ్యకు ఆస్పత్రిలో మోకాలిచిప్ప మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. నల్లగొండ మండలం చర్లపల్లికి చెందిన 65 ఏళ్ల వయసున్న వజ్జ ఎర్రయ్య విపరీతమైన మోకాలు నొప్పితో నడవలేని స్థితిలో నల్లగొండ ప్రభుత్వ ప్రధానాస్పత్రికి వైద్యం నిమిత్తం వచ్చాడు. ఆయన్ను పరీక్షించిన ఆర్థోపెడిక్ విభాగం వైద్యులు మోకాలి చిప్ప మార్పిడి చేయాలని, అందుకు శస్త్రచికిత్స చేయాలని, జిల్లా ఆస్పత్రిలోనే పూర్తి ఉచితంగా నిర్వహిస్తామని సూచించారు. అందుకు ఎర్రయ్య అంగీకరించడంతో ఈనెల 22న ఆస్పత్రిలో ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ నాగరాజు బృందం శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించి ఎర్రయ్యకు మోకాలిచిప్పను మార్పిడి చేశారు. డాక్టర్లు కృష్ణానాయక్, సైదులు, మల్లికార్జున్, రాహుల్ ఈ వైద్యబృందంలో భాగస్వాములయ్యారు. కార్పొరేట్ ఆసుపత్రుల తరహాలో అత్యుత్తమ నైపుణ్యాలతో, ఆధునిక ఇంప్లాంట్లతో ఈ చికిత్స జరిగిందని వైద్యులు వివరించారు. శస్త్రచికిత్స తర్వాత తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, మోకాలినొప్పి తగ్గిందని, ఆస్పత్రి వైద్యులకు అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి తెచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులకు ఎర్రయ్య కృతజ్ఞతలు తెలిపారు. వైద్యబృందాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి అభినందించారు.

వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే నోటీసులు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయించిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారని, ఏసీబీ నోటీసులు జారీ చేయించి బీఆర్ఎస్ నేతలపై బెదిరింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు వరుస నోటీసులు జారీ చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉన్నట్లు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఎవరెన్ని ఇబ్బందులుపెట్టినా కేసీఆర్ సారథ్యంలో పనిచేస్తామన్నారు. బీఆర్ఎస్‌ను చూస్తే కాంగ్రెస్ సర్కార్‌కు రోజు రోజుకూ భయపడే పరిస్థితి నెలకొందని, బెదిరింపులకు భయపడేది లేదని ఆయన పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలులో కనగల్ ప్రథమం

కనగల్, మే 27: (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది యాసంగి సీజన్‌ధాన్యం కొనుగోలులో ఐకేపీ కేంద్రాల జోరు కొనసాగింది. జిల్లాలో కనగల్ మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటుచేసిన 25 ఐకేపీ కేంద్రాల ద్వారా 55,506 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 6,842 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు ఏపీఎం సంకు హరి తెలిపారు. అందుకు సంబంధించి రూ.128కోట్లకు రూ.122 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ధాన్యం కొనుగోలులో శ్రమించిన మహిళా సంఘాలకు, సహకరించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

ద్విచక్రవాహనంపై మండలి చైర్మన్



చిట్యాలరూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ద్విచక్రవాహనం ఎక్కి గ్రామంలో కలియతిరిగారు. రాజ్యాంగబద్ధ పదవిలో నిత్యం అంగరక్షకుల భద్రతలో ఉండే ఆయన మంగళవారం తన స్వగ్రామమైన చిట్యాల మండలం ఉరుమడ్లకు వచ్చారు. గ్రామశివారులో ఉన్న తన వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించేందుకు సాధారణ రైతుగా తన అనుచరుడితో కలిసి బైక్‌పై వెళ్లారు. అక్కడ కలియ తిరుగుతూ క్షేత్రాన్ని పరిశీలించారు.

రోడ్డు పనులను వేగవంతం చేయాలి

పీఆర్ ఈఈ గిరిధర్



వల్లాలలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఈఈ గిరిధర్

శాలిగౌరారం, మే 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ విభాగంలోని పనులను వేగవంతంగా చేపట్టాలని పంచాయతీరాజ్‌శాఖ ఈఈ గిరిధర్ అన్నారు. మండలంలోని వల్లాల నుంచి జోలంవారిగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోడ్డు పనుల్లో నాణ్యత లోపించకుండా నిర్మించాలన్నారు. ఆయన వెంట డీఈఈ కొండయ్య, ఏఈ భరత్‌చంద్ర, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, వల్లాల మాజీ సర్పంచ్ షేక్ ఇంతియాజ్ అహ్మద్, నాయకులు కట్టంగూరు సురేందర్‌రెడ్డి, నరిగే ఆంజనేయులు, సంకటి లింగయ్య, తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడలో తిరంగా ర్యాలీ

ఉత్సాహంగా పాల్గొన్న యువత



మిర్యాలగూడలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న యువకులు

మిర్యాలగూడ టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కీర్తిస్తూ మంగళవారం మిర్యాలగూడలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణ, పరిసర ప్రాంత యువత ఉత్సాహంగా పాల్గొన్న ఈ ర్యాలీ ఫ్లైఓవర్ వద్ద ప్రారంభమై సాగర్‌రోడ్ మీదుగా రౌండ్ వరకు సాగింది. వ్యాపార, పారిశ్రామిక, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు. జైహింద్, జై భారత్ అంటూ జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాదినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో యువత స్వచ్ఛందంగా పాల్గొనడం హర్షనీయమన్నారు. భారతీయులందరూ కలిసికట్టుగా ఉండాలని, దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో చెరుపల్లి కరుణాకర్, బంటు సైదులు, చిలుకూరు శ్యాం, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎడ్ల రమేష్, బంటు సైదులు, రవీందర్‌గౌడ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెర్వుగట్టుపై ఘనంగా లక్ష పుష్పార్చన వేడుక



చెర్వుగట్టులో ఉత్సవ మూర్తులకు లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంపై మంగళవారం లక్ష పుష్పార్చన మహోత్సవం ఘనంగా జరిగింది. అమావాస్య సందర్భంగా నిర్వహించే ఈ వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమావాస్య తిథి సోమ, మంగళవారం రెండు రోజులు ఉండటంతో రెండు రోజుల పాటు క్షేత్రానికి భక్తుల తాకిడి కన్పించింది. కాగా, మంగళవారం గర్భాలయం నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ మహామండపానికి చేర్చారు. ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సహార్చకులు సతీశ్ శర్మ, సురేశ్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ పూజాధికాలు నిర్వహించి ఉత్సవ మూర్తులను అభిషేకించారు. స్వామి పాదాల చెంత పూజలు అందుకున్న పుష్పాల కోసం భక్తులు పోటీపడ్డారు. స్వామి వారి పుష్కరిణిలో స్నానమాచరించి పార్వతీ జడల రామలింగేశ్వరుడితో పాటు గుట్టపైన ఉన్న ఉపాలయాలు, గుట్ట కింద ఉన్న పార్వతీ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పాదరక్షలు, కోడె మొక్కులను తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో దేవస్థానం ఈవో సిరికొండ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, వర్షం కురవడంతో భక్తులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మాడ్గులపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూసలపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ పిచ్చమ్మకు సీఎం సహాయ నిధి నుంచి రూ.36వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును లబ్ధిదారుకు స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో చేపూరి సత్యనారాయణ, పాల్వాయి సైది రెడ్డ, పోలగాని రమేష్, యాదగిరి, రొండి వెంకన్న, ధైద కృష్ణ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

హాలియా,మే27(ఆంధ్రజ్యోతి): నాయుడుపాలెం గ్రామ పబ్బతి అంజనేయస్వామి వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజాలు నిర్వహించి యాగం చేశారు. వార్షికోత్సవం సందర్భంగా 30వ తేదీ వరకు దాతల సహకారంతో మహాఅన్నప్రసాద వితరణ ఏర్పాటు చేస్తున్నటు నిర్వాహకులు తెలిపారు.. దాతలు మెగావత్ మంగ్యానాయక్, కేతావత్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

సీపీఐ దేవరకొండ కార్యవర్గం



ఆంజనేయులు

దేవరకొండ, మే27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ దేవరకొండ పట్టణ కార్యవర్గాన్ని మంగళ వారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఎన్ను కున్నారు. పట్టణ కార్యదర్శిగా వలమాల ఆంజనేయులు, సహాయకార్యదర్శులుగా తోటపల్లి నగేష్, జూలూరి జ్యోతిబసుతో పాటు 23 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన సీపీఐ నాయకులకు ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

విచారణ జరిపించాలి

● మునిసిపల్ మాజీ చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎవెన్యూ ప్లాంటేషన్‌పై విచారణ జరిపించాలని మునిసిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని బైపాస్‌లో అవెన్యూ ప్లాంటేషన్ పేరిట నిధుల స్వాహా జరిగిందని ఆరోపించారు. 2023లో ఎవెన్యూ ప్లాంటేషన్ కోసం రూ. 70 లక్షలకు టెండర్ ఆహ్వానించారని, నిబంధనల మేరకు కాంట్రాక్టరు 90 రోజుల్లో పని పూర్తి చేసి మునిసిపాలిటీకి అప్పగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సదరు కాంట్రాక్టరు సక్రమంగా పని చేయని కారణంగా అప్పటి కమిషనర్, ఎంఈ, ఏఈ బిల్ నమోదు చేయలేదని వివరించారు. సంవత్సరాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడంతో అధికారులు బదిలీ అయ్యారని, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్, ఎంఈ, ఏఈ ఇప్పుడు హడావిడిగా బిల్లులు నమోదు చేసి చెక్ జారీ చేసినట్లు వివరించారు. తాను మునిసిపల్ చైర్మన్‌గా ఉన్న తరుణంలో పనులు జరగలేదన్నారు. మొక్కలు నాటకుండా నిధులు స్వాహా అవుతున్న తీరుపై విజిలెన్స్ విచారణ జరిపించాలని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠిని కోరారు.

బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి

మిర్యాలగూడ, మే 27 (ఆంధ్రజ్యోతి): పీసీసీ నియామకల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ ముఖ్యనేత నేత రాహుల్ గాంధీకి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లేఖ రాసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం పార్టీ పదవుల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం జరిగేలా చూడాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం అమలు కావడం లేదన్నారు. మంత్రి పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించేలా చూడాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, దోనేటి శేఖర్ పాల్గొన్నారు.

కరెంటుకు కర్రె ఆధారం

» సఫావత్‌తండాలో చేతికందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైరు
» ఐదేళ్లుగా పట్టించుకోని విద్యుత్ సిబ్బంది » ఆందోళనలో తండా వాసులు



సన్నని కర్రకు చుట్టిన తీగ

(ఆంధ్రజ్యోతి -తిరుమలగిరి(సాగర్)

మండలంలోని సఫావత్‌తండాలో ఇళ్లకు విద్యుత్ సరఫరా అయ్యే తీగలు కిందికి వేలాడుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జటావత్‌సేవా వీధిలో పొడవాటి కర్ర ఆధారంగా ఇళ్లకు విద్యుత్ సరఫరా అయ్యే తీగలు వేలాడదీయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తండా వాసులు భయం గుప్పిట్లో గడుపుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులకు తెలియచేసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని తండావాసులు విమర్శిస్తున్నారు. సుమారు 30 ఇళ్లకు విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏడేళ్ల క్రితం సంబంధిత అధికారులు తీగలు సిబ్బంది బిగించారు. అయితే విద్యుత్ స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండడంతో వైర్లు కిందకు వేలాడుతున్న క్రమంలో స్థానికులు కర్రతో ఆధారంగా నిలబెట్టారు. ఈ సమస్యపై గత ప్రభుత్వ హయాంలో అధికారుల దృష్టికి తీసుకురావడంతో నాలుగేళ్ల క్రితం కొత్త స్తంభాన్ని దానికి వైర్లు బిగించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.



నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన స్తంభం

ప్రమాదం జరిగే అవకాశం ఉంది

రెండు స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉంది. దీంతో తీగలు కిందకు వేలాడుతుండడం తో కర్ర సాయంతో నిలబెట్టాల్సి వచ్చింది. దీనివల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించాలి.

-మెరావత్ శ్రీను (సపావత్‌తండా)

సమస్యను పరిష్కరిస్తాం

ఈ సమస్య ఇప్పుడే మా దృష్టికి వచ్చింది. స్తంభాల ఏర్పాటు, విద్యుత్ తీగల బిగింపు తదితర పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను వెంటనే పరిష్కరిస్తాం.

- శేఖర్, విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ

పొంచి ఉన్న ప్రమాదం

కర్ర సాయంతో వేలాడుతున్న ఈ విద్యుత్ తీగ పెద్ద ఎత్తున గాలిదుమారం వర్షం వచ్చినప్పుడు పలు మార్లు వీధిలో కిందకు పడిపోయిందని స్థానికులు తెలిపారు. ఈ తీగ కింద నుంచి తండావాసులు నిత్యం వెళ్తుంటారు. గతంలో గాలివానకు తీగ తెగిపడడంతో మూగ జీవాలు కూడా మృత్యువాత పడ్డాయని తండావాసులు పేర్కొంటున్నారు. అధికారులు తక్షణమే స్పందించి తీగలను విద్యుత్ స్తంభానికి బిగించాలని స్థానికులు కోరుతున్నారు.



నేటి నుంచి లక్ష్మీతిరుపతమ్మ జాతర

● మూడ్రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు

వేములపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపెంట గ్రామంలో కొలువైన లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామి ఆలయ కల్యాణ మహోత్సవానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామ శివారులోని భీమారం- సూర్యాపేట రహదారి వెంట నిర్మించిన ఆలయానికి మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు నిత్యం ఎంతోమంది వచ్చి పూజలు నిర్వహిస్తుంటారు. 15 ఏళ్ల క్రితం రావులపెంట గ్రామ ప్రజలతోపాటు పరిసర గ్రామాల దాతల సహకారంతో నిర్మించారు. నాటి నుంచి ప్రతి ఏడాది స్వామివారి కల్యాణ మహోత్సవాలను మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా జిల్లా స్థాయి కోలాట పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ జిన్నె నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అవిరెండ్ల వేణులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు మాస్టర్ పల్లా ప్రసాద్ 9666738900ను సంప్రదించాలని సూచించారు. ఉత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం ఉదయం 8గంటలకు అమ్మవారికి బోనాలను సమర్పించి 11గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని పండితులు వైభవంగా నిర్వహించనున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నిడమనూరులో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న జైవీర్‌రెడ్డి పక్కన ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

తిరుమలగిరి(సాగర్), మే 27(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొంపల్లి గ్రామంలో 172 మంది అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ గతంలో మంత్రిగా పనిచేసిన కాలంలో కుందూరు జానారెడ్డి గ్రామాల్లో ఇళ్లు కట్టుకోవడానికి స్థలాలు లేని పేదల కోసం భూములను సేకరించేలా కృషి చేశారని అన్నారు. ఈ క్రమంలోనే గత ప్రభుత్వం వాటిని పేదలకు పంచలేకపోయినా మళ్లీ వాటిని అర్హులకు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో కొంపల్లి గ్రామంలో సర్వేనంబర్ 261లోని సుమారు నాలుగన్నర ఎకరాల్లో గల భూమిలో 99 మంది ఎస్సీలు, 44 మంది బీసీలు, 20 మంది మైనార్టీ, 8 మంది ఓసీలకు, ఒక ఎస్టీకి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వం ఒక్క ఇంటిని కట్టలేదని, తాము అధికారంలోకి రాగానే 3,500 ఇళ్లను నియోజకవర్గంలో మంజూరు చేశామని, గతంలో నియోజకవర్గంలో 33వేల ఇండ్లను కట్టించిన ఘనత జానారెడ్డికే దక్కుతుందన్నారు. అలాగే ఎల్లాపురం తండాలోని 120 మంది అర్హులకు త్వరలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. భూ సర్వేలో మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అర్హులైన రైతులను గుర్తించి వేలాది ఎకరాలకు పట్టాలు ఇవ్వనున్నట్లు, వచ్చే కొద్దిరోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా పేదలకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ అనిల్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కలసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ అంగోతు భగవాన్‌నాయక్, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం సాగర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రమావత్ కృష్ణానాయక్, నాయకులు గాలి చంద్రకళాప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాండునాయక్, మొసంగి వెంకటేశ్వర్లు, చిట్టి, నారాయణరెడ్డి, భిక్షం పాల్గొన్నారు.

● నిడమనూరు : పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 89 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీ మల్లిఖార్జున, ఆర్ఐలు దాడి రాజిరెడ్డి, సందీప్, మార్కెట్ ఛైర్మన్ అంకతి సత్యం, మేరెడ్డి వెంకట్‌రాహుల్, పసుపులేటి సైదయ్యనాయుడు, కొండా శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగు విజయ్, మోసాల శ్రీను, చర్క శ్రీను పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



సమావేశంలో పాల్గొన్న ఉద్యానశాఖ, కంపెనీ అధికారులు

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి),మే27(ఆంధ్రజ్యోతి): నీటి వసతులున్న వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తే రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి అనంత రెడ్డి అన్నారు. గుడిపల్లి మండలం చిలకమర్రి గ్రామంలో ఆయిల్ పామ్ నిర్వహణ- విధి విధానాలపై సాంకేతిక సమావేశాన్ని పతంజలి కంపెనీ ఉద్యాన శాఖ సహకారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్ పామ్‌పై ఇస్తున్న వివిధ రకాల సబ్సిడీలు, ఫామ్ పాండ్ లు, మిషనరీలు తదితర రాయితీల గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు. పతంజలి కంపెనీ జిల్లా మేనేజర్ డాక్టర్ మధు సూదన్ రెడ్డి పవర్ పాయింట్ ద్వారా రైతులకు సాంకేతిక విషయాల నీటి యాజమాన్యం, ఆయిల్ పామ్ వీవైల్స్ ప్రాధాన్యత, చౌడు నేలల యాజమాన్య సంరక్షణ చర్యల గురించి వివరించారు ఉద్యాన అధికారులు ఆప్ టైప్ మొక్కలపై రైతుల అపో హాలను తొలగించారు. పంతంజలి జనరల్ మేనేజర్ మాట్లాడుతూ రైతుల రవాణా ఇబ్బందులను తొలగించడానికి నల్లగొండ జిల్లాలోని అనుముల మండలంలో మిల్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు మిల్లు ప్రారంభిస్తామని రైతులకు డీజీఎం యాదగిరి భరోసా కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కర్నాటి లింగారెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యొల్గురి వల్లపురెడ్డి, ఉద్యానశాఖ అధికారులు రావుల విద్యాసాగర్, శ్వేత, రిషిత, నసీమ, మురళి, రైతుల సొసైటీ అధ్యక్షుడు గురువారెడ్డి, పతంజలి కంపెనీ డివిజన్ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్స్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంటమార్పిడిని అవలంబించాలి

డిండి, మే 27(ఆంధ్రజ్యోతి): రైతులు ఒకే పంటను వరుసగా వేయకుండా పంటమార్పిడిని అవలంబించాలని డిండి ఏవో రెహానా అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం పంటమార్పిడిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వివిధ రకాల పంటలు వేయడం వల్ల మట్టి పోషకాలు బలపడుతాయని భూసారం మెరుగవుతుందని తెలిపారు. మార్కెట్‌లో పంట ధర పడిపోయిన మిగిలిన పంట వల్ల నష్టాన్ని పూడ్చుకోవచ్చునని తెలిపారు. పంట మార్పిడి వల్ల మట్టి నిర్జీవం కావడం, నీటి వనరుల దుర్వినియోగం తగ్గుతుందని తెలిపారు. ఒకే పంట వేయడం వల్ల పంటలకు సోకే తెగుళ్లు సోకుతాయని తెలిపారు. కుటుంబాలకు కావలసిన అన్ని రకాల ధాన్యాలు, కూరగాయలు మనసే సాగుచేసుకోవచ్చునన్నారు. ఈసమావేశంలో ఏఈవో పరమేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్‌తో మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లు పట్టివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చింతపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను మంగళవారం అధి కారులు పట్టుకున్నారు. 'నల్లమట్టి కొల్లగొట్టి'అనే కథనం ఆంధ్రజ్యోతి జిల్లా పత్రికలో సోమవారం ప్రచురితమైంది. ఈ వార్తకు పోలీసులు స్పందించి రంగారెడ్డి జిల్లా మాడ్గుల్ మండలం అర్కపల్లి నుంచి మాల్ మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్న మూడు నల్లమట్టి టిప్పర్లను పట్టుకున్నారు. వాహనాలకు జరిమానా విధించారు. అనుమతి లేకుంగా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలుతీసుకుంటామని ఎస్ఐ రాంమూర్తి తెలిపారు.

సమాజంలో అంతరాలు లేని విద్య కావాలి



డిండిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అలుగువెల్లి నర్సిరెడ్డి

డిండి, హాలియా, కొండమల్లేపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): సమాజంలో అంతరాలు లేని విద్య కావాలని పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ అలుగువెల్లి నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ పౌరస్పందన వేదిక రాష్ట్ర కమిటీ ప్రచారజాత మంగళవారం డిండి, హాలియా, కొండమల్లేపల్లి మండల కేంద్రాల్లో నిర్వహించింది. ఆయా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతరాలు లేని విద్య కోసం పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం ద్వారానే ఇది సాధ్యమవుతుందన్నారు తెలంగాణ పౌరస్పందన వేదిక ఆధ్వర్యంలో అంతరాలులేని సమాజం కోసం అందరూ పాటుపడుతాం అనే సంకల్పంతో ముందుకు పోతున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం చేయాలని కోరారు. ప్రచారజాతకు డిండిలో యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు జి.రామారావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ డి.నారాయణరెడ్డి, కోశాధికారి వి.శ్రీను, ఎస్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ ఎండి.ఖాజారహమత్‌ఉల్లా, శ్యాంసుందర్, తిరుపతయ్య, యాదయ్య, నాగలక్ష్మి, వెంకటయ్య హాలియా కార్యక్రమంలో ఎంఈవో గుండా కృష్ణమూర్తి రాష్ట్ర బాధ్యులు మంగ, నాగమణి, ధనమూర్తి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వి.రాజు, జిల్లా కార్యదర్శి కొమర్రాజు, సైదులు, చింతపల్లి రవీందర్, సయ్యద్ మీయా, కృష్ణ, ఎర్రనాగుల సైదులు, బాణాల వెంకటేశ్వర్ రావు, మద్దెల ప్రసాద్, మన్నెం వెంకటేశ్వర్లు, కొండమల్లేపల్లిలో ధనమూర్తి, మంగ, నల్ల నరసింహ, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గంటా వెంకటయ్య, చాట్ల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నాయకులు ఆరెస్టు

చింతపల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్తుండగా పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ..గ్రామ పంచాయతీలకు బకాయి బిల్లుల చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో వందనపు అంజనేయులు, ఎల్లంకి అశోక్, ఖాలేద్, దాచేపల్లి మధు, ఎర్ర వెంకటయ్య, పెద్దయ్య పాల్గొన్నారు.



చింతపల్లిలో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ నాయకులు

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి



నెహ్రూ చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హాలియా, మే 27 (ఆంధ్రజ్యోతి): భారత మొదటి ప్రధానమంత్రి, భారత రత్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 61వ వర్ధంతిని స్థానిక ప్రధాన సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి మున్సిపాలిటీలోని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రదాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, యడవల్లి నరేందర్‌రెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, కుందూరు రాజేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, తక్కళ్లపల్లి సైదులు, నామిని సుధాకర్, శివరామయ్య, చవ్వాకుల రాజు, శ్రీను పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆయుధం

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆసుపత్రిలో ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ మాతృనాయక్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రకాష్ తెలిపారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతిరోజు 700 నుంచి 800వరకు రోగులు చికిత్స కోసం వస్తుంటారు. వర్షాకాలం ప్రారంభంకావడం, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 10 ఆక్సిజన్ సిలిండర్లు ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ ప్లాంట్ సైతం ఉంది. దీంతోపాటు ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాలమేరకు ప్రత్యేక పడకలు ఏర్పాటు చేశారు. ఐసీయూ బెడ్లు కూడా అందుబాటులో ఉన్నాయి. పీపీ కిట్లు, శానిటేషన్, మాస్కులు కూడా సిద్ధం చేశారు.

● మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి వైద్యులు కొవిడ్-19 సందర్భంగా సమకూర్చిన వసతులను తిరిగి అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు ప్రారంభించారు. 2020లో కొవిడ్ కేసుల తీవ్రతను పరిగణించి 100 పడకలతో విస్తరించిన ఏరియా ఆస్పత్రిని కొవిడ్ ఆస్పత్రిగా మార్చి ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక గదులకు అనుసంధానంగా ఆక్సిజన్‌ప్లాంటును సైతం ఏర్పాటు చేశారు. అప్పట్లో సమకూర్చిన వసతులన్నింటినీ తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు వైద్యాధికారులు సన్నద్ధమవుతున్నారు. మిర్యాలగూడకు సరిహద్దులో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, ఏటూరు, నెల్లూరు జిల్లాలో కరోనా పాజిటీవ్ కేసులు నమోదైన క్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వైద్యారోగ్యశాఖను అప్రమత్తం చేసింది. ఏపీ రాష్ట్రంలోని గుంటూరు నుంచి మిర్యాలగూడకు వ్యాపార, వాణిజ్య లావాదేవీలు కొనసాగింపులో భాగంగా ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుత పరిస్థితిలో ప్రజలు అనుసరించాల్సిన వ్యక్తిగత జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు వైద్యులు సిద్ధమయ్యారు. కొవిడ్ వ్యాప్తిని అరికట్టేంద ుకు అనుసరించాల్సిన నియమ, నిబంధనలపై ప్రజలను చైతన్యపరిచేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై క్షేత్రస్థాయి సిబ్బందికి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి గైనిక్ విభాగంలోని కొవిడ్‌వార్డును ప్రస్తుతం ప్రసవాల వార్డుగా వినియోగిస్తున్నారు. పరిస్థితిని బట్టి కొవిడ్ వార్డుగా మార్చి తిరిగి వినియోగంలో తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ సమరద్ తెలిపారు. కేసులను ఎదుర్కొనేందుకు తమ సిబ్బంది అన్ని విధాలా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రజలు వ్యక్తి జాగ్రత్తలు తీసుకుంటూ జనసంచారం అదికంగా ఉండే ప్రాంతాల్లోకి మాస్కులు ధరించి వెళ్లడం అన్ని విధాల శ్రేయస్కరమని, జిల్లాలో ప్రస్తుతం కొవిడ్ ప్రభావం లేదని ప్రజలు భయాందోళన చెం దకుండా వ్యక్తిగత జాగ్రత్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ, మే 27(ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చిలుక ప్రవీణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జమైతే ఉలేమా నియోజకవర్గ నాయకులు మౌలానా వలియుల్లా, ముఫ్తీ ఇమ్రాన్ కోరారు. ఈ మేరకు మంగళవారం మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూ న్యూస్ యూట్యూబ్ చానెల్‌లో ప్రవీణ్ ప్ర వక్తపై అనుచిత వ్యాఖ్యలు చేశారని అతడి చానెల్‌ను రద్దు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ముఫ్తీ ఉమర్, సలీం, నజ్మొద్దీన్, మౌ లానా అబ్దుల్ మన్నాన్, మౌలానా ఉత్రహమాన్, సయ్యద్ ఫరూక్, మోహసిన్, మస్తాన్ పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రారంభం

నాగార్జునసాగర్,మే27(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ హిల్‌కాలనీ కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రిలో ఉన్న అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ పరిధిలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కమలమ్మ మాట్లాడుతూ కార్యక్రమలో భాగంగా 100 రోజులు హిల్‌కాలనీ, పైలాన్ కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో టీబీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి నాగార్జునసాగర్(నందికొండ మునిసిపాలిటీ) ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిబ్బంది గంగాబాయి, లింగయ్య, మంచ్యా నాయక్, అంజయ్య, శైలజ పాల్గొన్నారు.

హోటల్ యజమానులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నాగార్జునసాగర్, మే27 (ఆంధ్రజ్యోతి): హోటల్ యజమానులు ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నందికొండ మునిసిపాలిటీ వార్డు ఆఫీసర్ కీర్తిరెడ్డి అన్నారు. మంగళవారం ఆమె సాగర్ హిల్‌కాలనీలో ఉన్న సిద్ధార్థ, బృందావన్ హోటల్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా హోటళ్లక కిచెన్‌లో నిల్వ ఉంచిన , నాణ్యత లేని ఆహార పదార్థాలను గుర్తించారు. అలాగే ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచిన మంసాన్ని, ఇతర ఆహార పదార్థాలను గుర్తించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని సిద్ధార్థ హోటల్ యజమానికి రూ. 2 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు సౌందర్య, రమేస్, శ్రీను, ఇంజనీరు బాలాజీ తదితరులు ఉన్నారు.

ఈపీఎఫ్‌పై అవగాహన

హాలియా,మే27(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ సిబ్బందికి మున్సిపాలిటీ కమిషనర్ రామదుర్గారెడ్డి అధ్యక్షతన ఉద్యోగ భవిష్యనిధి (ఈపీఎఫ్)పై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈపీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ కంచర్ల శ్రీనివాస్, సిబ్బంది సీలం ఉద్యోగ భవిష్య నిధికి సంబంధించి ఉద్యోగి వాటా, సంస్థ వాటా, పదవీ విరమణ అనంతరం ప్రయోజనాలు మొదలైన అంశాలపై వివరించారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : సింగిల్ / వెంకటేశ్వర: ఏస్ / రాఘవ: హిట్ 3 / విత్రోస్: ఏస్ ,వర్షం దేవరకొండ : మనోజ్ : 00 / మైత్రి వెంకటేశ్వర : శుభం